PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 220 | విజయవాడ, శుక్రవారం 15 మార్చి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 15 March 2024 | Rs

గెలుపే లక్ష్యంగా పని

- సిపిఎం అల్లూరి జిల్లా విస్తృత సమావేశంలో వి.శ్రీనివాసరావు

• లోపలి పేజీలో..•



2

ఫాసిస్టు దోపిడీకి విరుగుడు మార్క్సిస్టు సిద్ధాంతం

- మార్క్స్ వర్థంతి సందర్భంగా పలువురు నివాళి


బాండ్ల కిరికిరి

•వివరాలు వెల్లడి •అసలు విషయం రహస్యమే

•సుప్రీం తీర్పు స్ఫూర్తి బేఖాతరు •మళ్లీ తప్పని న్యాయపోరాటం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఎన్నికల కమిషన్ కలిసి సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తిని తుంగలో తొక్కాయి. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నట్లు ఒకవైపు కనిపిస్తూనే, మరోవైపు అసలు విషయాన్ని దాచేశాయి. దీంతో కొంతకాలంగా చర్చనీయాంశంగా ఉన్న ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం మరింత గందరగోళంగా మారింది. ఏ కంపెనీ నుండి ఏ పార్టీకి ఎంత నిధులు ముట్టాయన్న అంశాన్ని మినహా మిగిలిన వివరాలను ఎన్నికల కమిషన్ గురువారం రాత్రి బహిర్గతం చేసింది. తన వెబ్‌సైట్‌లో ఈ వివరాలను అప్‌లోడ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును అత్యంత పారదర్శకంగా అమలు చేసినట్లు ప్రకటించింది. మొత్తం 763 పేజీలతో రెండు భాగాలుగా ఇసి వెబ్‌సైట్‌లో ఉంచిన ఈ నివేదికలో యే తేదిన కొనుగోలు చేశారన్న వివరాలను పార్ట్ 1లోనూ, బాండ్లను నగదుగా మార్చుకున్న పార్టీల వివరాలు, ఎంత మొత్తం, తేదీలను పార్ట్-2లోనూ ఇసిఐ ప్రకటించింది. ఏ సంస్థ ఎంత మొత్తానికి బాండ్లను కొనుగోలు చేసిందన్న విషయాన్ని, ఏ



పార్టీకి ఎంత మొత్తంలో నిధులు అందాయన్న విషయాన్ని వీటి ఆధారంగా తెలుసుకునే వీలుంది. కానీ, ఏ సంస్థ, ఏ పార్టీకి ఎంత మొత్తాన్ని విరాళంగా ఇచ్చిందన్న విషయాన్ని తేల్చడం అసాధ్యం. దీంతో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆచరణలో వమ్ము చేసినట్టుయైంది. కీలకమైన ఆ విషయాన్ని ఎస్‌బిఐ దాచి పెట్టిందా, ఎస్‌బిఐ నుండి వివరాలు అందినా ఎన్నికల కమిషన్ ప్రకటించలేదా అన్న విషయాలు తెలియలేదు. ప్రభుత్వం నుండి తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చిన కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో మరోసారి న్యాయపోరాటం తప్పనిస్థితి నెలకొంది. ఎలక్టోరల్ బాండ్ల కేసులో పిటిషనర్ల తరపు వాదించిన న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ ఈ విషయం తెలిపారు. ఎలక్టోరల్ బాండ్లపై ఎస్‌బిఐ ముద్రించిన ఆల్ఫా న్యూమరిక్ కోడ్‌ను వెబ్‌సైట్‌లో వెల్లడి చేయలేదని ఆయన తెలిపారు. ఆ కోడ్ ఉంటే బాండ్లను కొన్న సంస్థల వివరాలను, రాజకీయ పార్టీలు మార్చిన బాండ్లతో పోల్చి, ఎవరు ఎవరికి ఇచ్చారన్న విషయాలను తెలుసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఆ కోడ్‌ను వెల్లడిచేయాలని కోరుతూ మరోసారి పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని చెప్పారు. వాస్తవానికి సుప్రీంకోర్టు తొలుత ఇచ్చిన తీర్పులోనే దీనిని కూడా వెల్లడి చేయాలన్న అంశం అంతర్లీనంగా ఉందని ఆయన అన్నారు. ఎడిఆర్ సహ వ్యవస్థాపకుడు జగదీప్ చోకర్ 'ప్రస్తుతం అందిన సమాచారంతో ఏం చేయగలమన్న అంశాన్ని పరిశీలిస్తున్నాం' అని చెప్పారు.

	సంస్థ పేరు	రూ.కోట్లలో
1.	ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్స్	1,368
2.	మేఘా ఇంజినీరింగ్	966
3.	క్విక్ సప్లై చైన్ ప్రైవేట్ లిమిటెడ్	410
4.	వేదాంత లిమిటెడ్	400
5.	హాల్దియా ఎనర్జీ లిమిటెడ్	377
6.	భారతి గ్రూప్	247
7.	ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్	224
8.	వెస్టర్న్ యుపి పవర్ ట్రాన్స్‌మిషన్	220
9.	కెవెంటర్ ఫుడ్‌పార్క్ ఇన్‌ఫ్రా లిమిటెడ్	194
10.	మదన్‌లాల్ లిమిటెడ్	185
11.	డిఎల్‌ఎఫ్ గ్రూప్	170
12.	యశోదా హాస్పిటల్	162
13.	ఉత్కల్ అలుమినా ఇంటర్నేషనల్	145
14.	జిందాల్ స్టీల్ పవర్ లిమిటెడ్	123
15.	బిర్లా కార్బన్ ఇండియా	105
16.	రుంగ్టా సన్స్	100
17.	డాక్టర్ రెడ్డీస్	80
18.	పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్	60
19.	నవయుగ ఇంజినీరింగ్	55
20.	షిర్డిసాయి ఎలక్ట్రికల్స్	40
21.	ఎడెల్‌వైజ్ గ్రూప్	40
22.	సిప్లా లిమిటెడ్	39
23.	లక్ష్మి నివాస్ మిట్టల్	35
24.	గ్రాసిమ్ ఇండస్ట్రీస్	33
25.	జిందాల్ స్టెయిన్‌లెస్	30
26.	బజాజ్ ఆటో	25
27.	సన్ ఫార్మా లేబొరేటరీస్	25
28.	మన్‌కిండ్ ఫార్మా	24
29.	బజాజ్ ఫైనాన్స్	20
30.	మారుతి సుజుకీ ఇండియా	20
31.	అల్ట్రాటెక్	15
32.	టివిఎస్ మోటర్స్	10



కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

హైకోర్టు ఏర్పాటుకు అడుగులు

- కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయం శంకుస్థాపనలో సిఎం జగన్
- బనగానపల్లెలో 'ఇబిసి నేస్తం' మూడో విడత నిధులు విడుదల

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కర్నూలు జగన్నాథగట్టు వద్ద జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. బనగానపల్లె ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బటన్ నొక్కి ఇబిసి నేస్తం మూడో విడత నిధులు విడుదల చేశారు. లబ్ధిదారులకు మెగా చెక్ పంపిణీ చేశారు. బనగానపల్లెలో నూతనంగా నిర్మించిన వంద పడకల ప్రాంతీయ వైద్యశాల ప్రారంభం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్నూలులోని జగన్నాథం గట్టు వద్ద, బనగానపల్లెలోనూ జరిగిన సభల్లో ముఖ్యమంత్రి మాట్లాడారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం హైకోర్టు కర్నూలులోనే ఉండాలన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా పేదల భవిష్యత్తుపై యుద్ధానికి వస్తున్నాయని విమర్శించారు. ఈ మూడు పార్టీలూ 2014లో మోసపూరిత వాగ్దానాలు చేశాయని, అక్కచెల్లెమ్మల కోసం తొమ్మిది హామీలు ఇచ్చాయని, వాటిలో ఒకటీ అమలు చేయలేదని అన్నారు. దారుణంగా మోసం చేసిన వారు ఈ ఎన్నికల్లో రంగురంగుల మేనిఫెస్టోలతో వస్తున్నారని, వారి హామీలను నమ్మవద్దని ప్రజలను కోరారు. 99 శాతం హామీలను అమలు చేసిన మీ బిడ్డకు, మాయ మాంత్రికులకు మధ్య యుద్ధం జరుగుతోందని పేర్కొన్నారు.

మోసం చేసిన వాళ్లకు ఓటు అనే దివ్యాస్త్రంతో గుణపాఠం చెప్పాలన్నారు. అక్క చెల్లెమ్మలు బాగుంటే కుటుంబాలు బాగుంటాయని, ఎక్కడా కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రతి పథకం లబ్ధిదారులకు అందుతోందని వివరించారు. విశ్వసనీయత లేదంటూ చంద్రబాబును, విలువలు లేవంటూ పవన్ కల్యాణ్‌ను విమర్శించారు. బనగానపల్లె వైసిపి అభ్యర్థిగా కాటసాని రామిరెడ్డిని ప్రకటించారు. ఆయనను గెలిపించాలని కోరారు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామమూర్తి, లోకాయుక్త చీఫ్ జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి జి.సత్యప్రభాకర్, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

34 మందితో టిడిపి రెండో జాబితా

- సీనియర్లకు దక్కని చోటు

2

ఎన్నికల విధుల్లో వలంటీర్లు వద్దు

- కలెక్టర్లకు సిఎస్ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల విధుల్లో గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొనకూడదని, ఎన్నికలకు సంబంధించి ఎటువంటి విధుల్లో ఉన్నా వెంటనే తొలగించాలని కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం మెమో జారీ చేశారు. ఎన్నికలతో ముడిపడి ఉన్న ప్రక్రియలో వలంటీర్లు పాల్గొనకుండా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. వలంటీర్లు ఎలాంటి ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నా ఇసి మార్గదర్శకాల ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. పోలింగు ఏజెంట్లుగా ఉండేందుకు కూడా అర్హులు కారని పేర్కొన్నారు. అధికార పార్టీ తరపున వారు పనిచేస్తున్నారని, గిఫ్టులు, డబ్బులు పంపిణీ చేస్తున్నారని, అధికార పార్టీ కార్యక్రమాలకు జనాన్ని తరలిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తూ వచ్చాయి. ఈ నేపథ్యంలో వారిని ఎన్నికల విధుల్లోంచి తొలగించాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై కోర్టుల్లోనూ పిటిషన్లు దాఖలు చేశారు. వారిని ఎన్నికల విధుల్లో వినియోగించొద్దని హైకోర్టు సూచన కూడా చేసింది. అయినా వారు ఎన్నికల అనుబంధం పనుల్లో ఉన్నారని ఫిర్యాదులు చేయడంతో ఎన్నికల కమిషన్ నుండి వచ్చిన ఆదేశాల మేరకు వలంటీర్లను ఎన్నికల విధుల్లో వినియోగించొద్దని సిఎస్ ఆదేశాలు జారీ చేశారు.

బిజెపిని ఓడించేందుకు ఐక్య పోరాటం

- రైతు, కార్మిక విరోధి మోడీ సర్కార్
- 23న దేశవ్యాప్త ఆందోళనలు
- ఎంఎస్‌పి చట్టాన్ని చేయాలి
- బిజెపిని తరిమికొట్టాలి... దేశాన్ని రక్షించాలి
- చారిత్రాత్మకంగా కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్

రాంలీలా మైదానంలో కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్‌లో ప్రసంగిస్తున్న విజూ కృష్ణన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బడా పారిశ్రామిక వేత్తలతో కలిసి దేశ సంపదను దోచుకుంటున్న మోడీ ప్రభుత్వంపై కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్ రణభేరీ మోగించింది. గురువారం రాంలీలా మైదానంలో ఎస్‌కెఎం ఆధ్వర్యంలో కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్ జరిగింది. సంయుక్త కిసాన్ మోర్చా, సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు పిలుపు మేరకు లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థులు, యువకులు, న్యాయవాదులు, మేధావులు, రచయితలు సంఘీభావం తెలిపారు. కిసాన్ మజ్దూర్ మహా పంచాయితీని జయప్రదం కాకుండా అడ్డుకునేందుకు కేంద్రం చేసిన అన్ని ప్రయత్నాలను రైతులు, కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టారు. కేవలం ఐదు వేల మందిని మాత్రమే ఢిల్లీకి అనుమతిస్తామన్న పోలీసుల తీరుకు చెంపపెట్టుగా లక్షన్నర మంది హాజరయ్యారు. చరిత్రాత్మక మహా పంచాయితీలో అపూర్వమైన మహిళల భాగస్వామ్యం ఉంది. పంజాబ్, హర్యానా వంటి సమీప రాష్ట్రాల నుంచే కాకుండా దక్షిణాది రాష్ట్రాల నుండి రైతులు, వ్యవసాయ కార్మికులు కదలి వచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకే మైదానం దాదాపు నిండిపోయింది. ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి బుధవారం రాత్రి బురద నీటితో మైదానాన్ని నింపి పోలీసుల కుయుక్తులు అన్నదాతల ముందు ఫలించలేదు. బిజెపిని తరిమికొట్టండి, దేశాన్ని రక్షించండి అంటూ నినాదాలు మార్మోగాయి.

కేంద్రంపై ఉద్యమం ఉధృతం

లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు ఐక్యంగా పోరాడాలని మహా పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. యునైటెడ్ పీపుల్స్ మూవ్ మెంట్ ఫోరంను ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయిల్లో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కేంద్రంపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. హర్యానాలో యువ రైతు శుభకరన్ సింగ్‌ను కాల్చి చంపి రైతులను అణిచివేసేందుకు కారణమైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని మహా పంచాయతీ డిమాండ్ చేసింది. అమిత్ షాతో పాటు హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, మాజీ హోంమంత్రి అనిల్ విజ్‌లపై హత్యానేరం మోపాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై న్యాయ విచారణ జరగాలని తెలిపింది. లఖింపుర్‌ఖేరీ రైతు మారణకాండ సూత్రధారి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా బిజెపి నంచి మళ్లీ పోటీ చేయడాన్ని నిరసిస్తూ 23న అన్ని గ్రామాల్లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ

మిగతా 7లో

పిఠాపురం నుంచి పవన్ పోటీ

- రాష్ట్ర భవిష్యత్ కోసమే త్యాగాలు : జనసేనాని

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల పోటీపై నెలకొన్న సందిగ్ధత ఎట్టకేలకు తొలగిపోయింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు ఆయన గురువారం ప్రకటించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. శ్రీపాద వల్లభుడు జన్మించిన పవిత్ర స్థలమైన పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. 'వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపిగా పోటీ చేయాలని కొందరు.. ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లాలని మరికొందరు కోరుతున్నారు. నాకు మాత్రం ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉంది. పిఠాపురం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తాను. ఎంపిగా కూడా పోటీచేయాలన్న దానిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటా' అని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో జనసేన పోటీ చేసే 21 స్థానాల్లో వందశాతం స్ట్రైక్ రేట్ ఉండేలా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని, టిడిపి, బిజెపితో కూడిన



పొత్తును అందరూ ఆశీర్వదించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఐదు కోట్ల ఆంధ్రుల భవిత కోసం ఎన్నికల్లో పోటీ చేసే కొన్ని సీట్లు త్యాగం చేయక తప్పలేదని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పొత్తులో భాగంగా కొందరికి అవకాశం ఇవ్వలేకపోయామని, ఆఖరుకు తన సొంత అన్నయ్య నాగబాబుకు కేటాయించిన సీటును కూడా వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పవన్‌కల్యాణ్ వివరించారు.

అప్పు చేసి పంచితే సంక్షేమం అవ్వదు

అప్పు చేసి డబ్బు పంచితే సంక్షేమం అవ్వదని, ఆ అప్పును మళ్లీ కట్టాల్సింది రాష్ట్ర ప్రజలేనని ఆయన తెలియజేశారు. తెచ్చిన డబ్బులో సగం సిఎం జగన్ నొక్కేస్తుంటే.. మరికొంచెం ఆయన సభలకు, సమావేశాలకు, ప్రచారాలకు సరిపోతుందని ఆరోపించారు. జనాన్ని కన్నీరు పెట్టించిన ప్రభుత్వం.. ఆ కన్నీటితోనే కూలిపోతుందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

పిఠాపురంలో టిడిపి శ్రేణుల ఆందోళన 3

పెట్రోల్, డీజిల్ ధర రూ.2 చొప్పున తగ్గింపు

న్యూఢిల్లీ : కోవిడ్ విపత్తు సమయంలోనూ ఇంధన ధరలను పదేపదే పెంచుతూ ప్రజలపై భారాలు మోపిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పెట్రోలు, డీజిలు ధరలను స్వల్పంగా తగ్గించింది. పెట్రోలు, డీజిలు ధరలను లీటరుకు రూ.2 చొప్పున తగ్గిస్తున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. ఈ నెల 15 ఉదయం 6 నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు. ఇంధన ధరలను రూ.2 చొప్పున తగ్గించి పేదల పక్షపాతిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిలిచారని ఆయన గొప్పలు చెప్పుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర తగ్గినా ఆ తగ్గింపు ధరను కూడా కాజేసి పదేపదే ఇంధన ధరలు పెంచుతూ వచ్చిన మోడీ సర్కార్‌కు ఎన్నికల వేళ ఇలాంటి జిమ్మిక్కులు చేయడం పరిపాటేనని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో గురువారం సాయంత్రం నాటికి లీటరు పెట్రోల్ రూ.111.71, డీజిల్ రూ.99.51గా ఉంది. ఈ ధరలు శుక్రవారం నుంచి రూ.2 చొప్పున తగ్గనున్నాయి.

విశాఖ (ఉత్తరం) నుంచి పోటీ

- వివి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ, సీతమ్మధార (విశాఖపట్నం)



రానున్న ఎన్నికల్లో తాను విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఎపి యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ వివి.లక్ష్మీనారాయణ ప్రకటించారు. తమ పార్టీకి కేంద్ర ఎన్నికల కమిషన్ టార్చ్ లైట్ గుర్తు కేటాయించినట్టు చెప్పారు. గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సి ఉందన్నారు. ఆల్ తెలుగు ప్రజా పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కె.శివ భాగ్యారావు, ప్రభుద్ధ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జిఎస్ఆర్‌కెఆర్.విజయ్ కుమార్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్, నవతరం పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'జమిలి'కి తలూపారు

- రాష్ట్రపతికి నివేదిక అందజేసిన కోవింద్ కమిటీ
- 32 పార్టీలు మద్దతు, 15 పార్టీలు వ్యతిరేకం
- రాజ్యాంగంలో ఐదు అధికరణలకు సవరణలు
- తొలుత లోక్‌సభ, అసెంబ్లీలకు,ఆ తరువాత వంద రోజులకు స్థానిక సంస్థల ఎన్నికలకు సిఫార్సు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2029లో దేశంలో జమిలి ఎన్నికలు సాధ్యమేనంటూ రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటి ప్రతిపాదించింది. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని కమిటీ ఏకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించింది. దేశంలో ఒకేసారి ఎన్నికలతో ఎన్నో ప్రయోజనాలున్నాయని కమిటీ పేర్కొంది. ఒకే దేశం -ఒకే ఎన్నిక (జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్య సాధ్యాల)పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ అధ్యాయనం పూర్తి అయింది. ఈ కమిటీ తుది నివేదికను గురువారం రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రామ్‌నాథ్ కోవింద్‌తో సహా కమిటీ అందజేశారు. జమిలి ఎన్నికలపై విస్తృత సంప్రదింపులు, సమావేశాలు, అభిప్రాయ సేకరణ అనంతరం ఎనిమిది భాగాలుగా 18,626 పేజీల నివేదికను రూపొందించింది. దాదాపు 190 రోజుల పాటు ఈ అంశంపై కమిటీ అధ్యయనం జరిపింది. పలు రంగాల నిపుణులతో విస్తృత సమావేశాలు నిర్వహించింది. 47 రాజకీయ పార్టీలు దీనిపై తమ అభిప్రాయాలు తెలిపాయి. ఇందులో 32 జమిలికి మద్దతిచ్చాయి.

15 పార్టీలు వ్యతిరేకించాయి. నలుగురు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఏకకాల ఎన్నికలను నిర్ద్వంద్వంగా ఆమోదించారని నివేదిక పేర్కొంది. ప్రజల నుంచి కూడా కమిటీ సలహాలు, సూచనలు కోరగా.. 21,558 స్పందనలు వచ్చాయి. వీరిలో 80 శాతం మంది ఏకకాల ఎన్నికలను సమర్థించారు. ఇవన్నీ అధ్యయనం చేసిన అనంతరం కమిటీ నివేదిక రూపొందించింది. ఒకేసారి ఎన్నికల కోసం కోవింద్ కమిటీ నిర్దిష్ట సిఫార్సులు చేసింది.

కమిటీ ప్రతిపాదనలు

జమిలి ఎన్నికలకు కోవింద్ కమిటీ రెండంచెల విధానాన్ని సూచించింది. తొలుత లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో పోలింగ్ నిర్వహించాలని పేర్కొంది. ఆ తరువాత 100 రోజులకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు జరపాలని నివేదికలో తెలిపింది. ఇందుకోసం రాజ్యాంగంలో ఆర్టికల్ 83 (పార్లమెంట్ పదవీకాలం), ఆర్టికల్ 172 (రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం), పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఏకకాల ఎన్నికల కోసం ఆర్టికల్ 324ఎ, ఒకే ఓటర్ల జాబితా, ఒకే ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డు కోసం ఆర్టికల్ 325 వంటి రాజ్యాంగ సవరణ సహా కనీసం ఐదు ఆర్టికల్స్ ను సవరించాలని కమిటీ సూచించింది. ఈ సవరణలకు రాష్ట్రాల ఆమోదం అవసరం. ఇక, ఎన్నికలకు ఉమ్మడిగా ఓటర్ల జాబితా ఉండాలని

మిగతా 7లో

'ఉక్కు' భూములు అమ్మారో లేదో చెప్పండి

- కేంద్రానికి హైకోర్టు ఆదేశం

2



ఎపిఇసెట్ నోటిఫికేషన్ విడుదల

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మే 8న పరీక్ష : చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఎపి ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపిఇసెట్-2024 నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం జెఎన్‌టియు ఉపకులపతి, ఎపిఇసెట్ చైర్మన్ జివిఆర్.శ్రీనివాసరావు వెల్లడించారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 15 వరకు ఎలాంటి రుసుం లేకుండా ఒసి విద్యార్థులు రూ.600, బిసి విద్యార్థులు రూ.550, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 22 వరకు, రూ.2000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 29 వరకు, రూ.ఐదు వేలు అపరాధ రుసుంతో మే రెండు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మే ఒకటి నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. మే ఎనిమిదిన ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, సెరామిక్ టెక్నాలజీ, బిఎస్‌సి గణితం, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటలు నుంచి సాయంత్రం 5.30 గంటలకు ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మైనింగ్, మెటలార్జికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



కర్నూలు కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

రైతు, కార్మిక వ్యతిరేకి మోడీ

- కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో మహాపంచాయత్
- మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు
- స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలుకు పోరాటం

ప్రజాశక్తి - యంత్రాంగం

రైతు, కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న మహా పంచాయత్ కార్యక్రమానికి మద్దతుగా అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గురువారం ప్రదర్శనలు నిర్వహించారు. రైతు నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని, మద్దతు ధర ఇవ్వాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతాంగ ఉద్యమంలో మరణించిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని నినదించారు.

విజయవాడ లెనిన్ సెంటర్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడారు. కార్పోరేట్‌ల సేవలో తరిస్తోన్న బిజెపిని ఓడించడం ద్వారానే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు పురోభివృద్ధి చెందుతాయని, లేదంటే వినాశనమేనని అన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ... వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌ల గుప్పెట్లోకి నెట్టేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... రైతులకు ఇచ్చిన మాటను తప్పిన మోడీని గద్దె దించాల్సిందేనని అన్నారు. ఎపి వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిఐటియు నాయకులు కె సుబ్బరావమ్మ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఇఫ్టు, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

కర్నూలులో జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య పాల్గొన్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన సంఘీభావ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పాల్గొని, మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. అనకాపల్లిలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడారు.కాకినాడలో ఇంద్రపాలెం లాకుల వద్ద అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే ధర్నా చేపట్టారు.

శ్రీకాకుళం, ఒడిశాలోని పర్లాకిమిడిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ పాల్గొన్నారు. అనంతపురంలో లలిత కళాపరిషత్ నుంచి టవర్ క్లాక్ వరకు, తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకూ సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద తెలిపిన నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి పాల్గొన్నారు. విజయవాడ, ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప, పశ్చిమగోదావరి, విజయనగరంలో ప్రదర్శనలు చేపట్టారు.



విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ఫాసిస్టు దోపిడీకి విరుగుడు మార్క్సిస్టు సిద్ధాంతం

- మార్క్స్ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామ్రాజ్యవాద, కార్పొరేట్ పెట్టుబడిదారీ దోపిడీ, ఫాసిస్టు విధానానికి మార్క్స్ సూచించిన సిద్ధాంతం ఆచరణే విరుగుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కార్ల్‌మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా మార్క్స్ ఎంగెల్స్ విగ్రహ కమిటీ ఆధ్వర్యాన గురువారం విజయవాడ హనుమాన్‌పేటలోని మార్క్స్, ఎంగెల్స్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. అప్పటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు సాగించి విప్లవ విజయాలు సాధించిన సోవియట్, చైనా, క్యూబా, వియత్నాం వంటి అనేక దేశాలు సోషలిజం, కమ్యూనిజం బాటలో నడిచాయని తెలిపారు. మార్క్సిజాన్ని పెద్ద భూతంగా చూపించి అంతం చేయాలని సామ్రాజ్యవాద దేశాలు కుట్రలు చేశాయని అన్నారు. ప్రస్తుతం దేశంలో బిజెపి ఆధ్వర్యాన ఫాసిస్టు పాలన నడుస్తోందని, మార్క్సిజం స్ఫూర్తితో నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పనిచేయాలని కోరారు.

సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రపంచం నేడు సామ్రాజ్యవాద శక్తుల గుప్పెట్లో ఉందని, దాన్నుండి రక్షించాలని కోరారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కె పొలారి మాట్లాడుతూ.. పీడిత ప్రజల విముక్తి కోసం మార్క్స్, ఎంగెల్స్ సిద్ధాంతాన్ని తీసుకొస్తే లెనిన్, స్టాలిన్ అమలు చేసి చూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, కె సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు జయరాం, రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, పిఎన్‌ఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్, సిపిఐ రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య, రవీంద్రనాథ్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, రైతు కూలీ సంఘం నాయకులు ముప్పాళ్ల భార్గవశ్రీ, ఇస్కఫ్ కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత అనిల్, చంద్రానాయక్, పిచ్చయ్య విప్లవ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమానికి బుడ్డిగ జమిందార్ అధ్యక్షత వహించారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, బి.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1127వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ వంటి పరిశ్రమలు ప్రయివేటుపరమైతే రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందని, యువత ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. ఉత్తరాంధ్ర మణిమకుటమైన విశాఖ ఉక్కును కాపాడతామని అన్ని పార్టీలూ వాటి మేనిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అనుచరులతో గంటా సమావేశం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తన అనుచరులతో విశాఖ రుషికొండలోని ఒక విల్లాలో గురువారం సమావేశమయ్యారు. తాను ఈసారి విశాఖ జిల్లా భీమిలి నుంచి పోటీ చేస్తానని టిడిపి అధినేతను కోరడం, విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని చంద్రబాబు తేల్చి చెప్పడంతో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. చీపురుపల్లి నుంచి పోటీ చేస్తే విజయం కష్టమని, భీమిలి నుంచే పోటీ చేయాలని ఈ సమావేశంలో గంటాకు కొందరు సూచించినట్లు, అధిష్టాన వైఖరి సరిగా లేదని, పార్టీ మారాలని మరికొందరు సలహా ఇచ్చినట్లు సమాచారం. దీంతో, గంటా ఎటూ తేల్చుకోలేకపోయారు. శుక్రవారం మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఒకసారి ఒకచోట నుంచి గెలిచాక అక్కడి నుంచి మరలా గంటా పోటీ చేయలేదు. 1999లో అనకాపల్లి ఎంపీగా, 2004లో చోడవరం, 2009లో అనకాపల్లి, 2014లో భీమిలి, 2019లో విశాఖ ఉత్తర నియోజక ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతానికి భిన్నంగా ఈసారి ఆయన మళ్లీ భీమిలి కోరినా అధిష్టానం ఇవ్వలేదు. గెలిచిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండరనే అపవాదు గంటాపై ఉంది. టిడిపి 2019లో అధికారం కోల్పోయి కష్టకాలంలో ఉన్నప్పుడు కనిపించకుండా పోయారని, పార్టీ మారేందుకు ప్రయత్నించారని విమర్శలు ఉన్నాయి. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు కనీసం పరామర్శకు వెళ్లలేదు. వైసిపి అధిష్టానంలోని కొంతమందితో లోపాయికారి మంతనాలు జరిపారన్న చర్చ టిడిపి అధినేతకు ఉండడంతో గంటాకు కోరిన స్థానం ఇవ్వలేదని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పోటీ కోసం మిత్రులు, శ్రేయోభిలాషులతో చర్చించానని, ఆ వివరాలను అధిష్టానానికి తెలియజేస్తానని గంటా శ్రీనివాసరావు గురువారం రాత్రి ప్రకటించారు.

కమ్యూనిస్టులతోనే ప్రజల హక్కులకు రక్షణ

అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం పోటీ : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

కమ్యూనిస్టులతోనే ప్రజల హక్కులకు రక్షణ ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో అరకు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో సిపిఎం పోటీ చేయనుందని, ప్రజలు గెలిపించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో వి.శ్రీనివాసరావు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఏజెన్సీలో దోపిడీని ప్రతిఘటించడంలో సిపిఎం, ఎర్రజెండా చేసిన త్యాగాలు, పోరాటాలు కీలకమని తెలిపారు. పాలకులు ఏజెన్సీలో దాడులు చేసి వందల, వేల ఎకరాలను బడాబాబులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి భూములు కాజేయడానికి హైడ్రో పవర్ ప్రాజెక్టులను తెస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి షెడ్యూల్డ్ ప్రాంతంలోని గిరిజనుల హక్కులను కాలరాసి అదానీ వంటి కార్పొరేట్లకు అప్పగించడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. 370 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బిజెపి ప్రకటించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం మార్పు జరిగితే గిరిజన చట్టాలను ఎత్తేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో క్రిస్టియన్, హిందువుల మధ్య మత చిచ్చు పెట్టేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళిక రూపొందించిందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్లాన్‌కు లొంగిపోయి టిడిపి, జనసేనలు మద్దతిస్తున్నాయన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గిరిజన యూనివర్సిటీ ప్రారంభించి పదేళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. పదేళ్లుగా యూనివర్సిటీ కట్టడం చేతకాని వారు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటే ప్రజలు నమ్ముతారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బ్యాంకులకు రూ.350 కోట్లు ఎగ్గొట్టిన కొత్తపల్లి గీత బిజెపి తరుపున అరకు ఎంపి అభ్యర్థిగా వస్తున్నారని, బ్యాంకు సొమ్ము, దోపిడీ చేసిన వ్యక్తిని ఆదివాసీలు గెలిపించాలా? అని నిలదీశారు. అరకు వైసిపి ఎంపి మాధవి కూడా ఏనాడూ పార్లమెంట్‌లో గిరిజన హక్కులపై మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. జిఒ నెంబర్ 3 రద్దు విషయంలోనూ ఆమె నోరు మెదపలేదని తెలిపారు. అభివృద్ధిలోనూ, గిరిజనుల హక్కులను కాపాడడంలోనూ వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ఆదివాసీ ప్రాంతం అశాంతికి బిజెపి, వైసిపిలే కారణమవుతాయని తెలిపారు. దేశంలో సిఎఎ వస్తే ముస్లిములకే కాకుండా ఆదివాసులకు కూడా ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎఎ విషయంలో వైసిపి, టిడిపి, జనసేన ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. కేరళ, తమిళనాడుల్లో తమ వైఖరులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధి అంటే మోడీకి భజన చేస్తూ రాష్ట్రంలోని ప్రధాన పార్టీల నేతలు జైలుకు వెళ్లకుండా ఉండడమా అని అన్నారు. వామపక్షాల ప్రతినిధులు అసెంబ్లీ, పార్లమెంట్‌ల్లో ఉంటే అందరికీ మేలు జరుగుతుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు పాల్గొన్నారు.

గ్రూప్-1 అక్రమాలపై సిబిఐ విచారణ

- టిడిపి అధినేత చంద్రబాబు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించిన గ్రూప్-1 పోస్టుల భర్తీలో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. మెయిన్స్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో ప్రభుత్వ పెద్దల వైఫల్యాలు, కుట్రలకు నిరుద్యోగ యువత బలైందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో మునుపెన్నడూ లేని వివాదాలు ఎందుకు తలెత్తాయని, వాటికి కారణాలు ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తమ వారిని పోస్టింగుల్లో కూర్చోబెట్టుకునేందుకు పోస్టులను అమ్ముకుని అర్హులైన వారికి అన్యాయం చేశారని విమర్శించారు. అక్రమాలకు పాల్పడి సర్వీస్ కమిషన్ ప్రతిష్టను, విశ్వసనీయతను దెబ్బతీశారని పేర్కొన్నారు. అక్రమాల వెనుక ఉన్న కమిషన్ పెద్దల పాత్ర నిగ్గుతేలాలంటే సిబిఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఛైర్మన్ గౌతమ్ సవాంగ్, మాజీ కార్యదర్శి, ఐపిఎస్ అధికారి సీతారామాంజనేయులును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని కోరారు. రాజ్యాంగబద్ధ సంస్థను రాజకీయ లబ్ధికి, అక్రమాలకు వేదిక చేసి, లక్షల మంది నిరుద్యోగుల నోట్లో సిఎం వైఎస్ జగన్ మట్టికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు జాబ్ కేలండరు రాక, ఇటు ప్రైవేటు సెక్టార్‌లో ఉద్యోగాలు లేక తీవ్ర నిరాశలో యువత ఉందని తెలిపారు.

ప్రబీర్ పుర్కాయస్థను తక్షణం విడుదల చేయాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అక్రమ కేసుల్లో నిర్బంధించిన సీనియర్ జర్నలిస్టు ప్రబీర్ పుర్కాయస్థను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) డిమాండ్ చేసింది. న్యూస్ క్లిక్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థల వేధింపులను నిరసిస్తూ, తక్షణం ప్రబీర్ పుర్కాయస్థను విడుదల చేయాలని ఢిల్లీలో నేషనల్ జర్నలిస్ట్ అలయన్స్ పిలుపు మేరకు జర్నలిస్టులు చేపట్టిన నిరసనలకు ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ సంఘీభావం తెలిపాయి. ఈ మేరకు గురువారం ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకట్రావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు, ఎపిబిజెఎ ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసులు, కోశాధికారి కె మునిరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూస్ క్లిక్‌పై దాడులు చేయడంతోపాటు బ్యాంకు ఖాతాలను సీజ్ చేయడంతో జర్నలిస్టులకు వేతనాలు అందని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కేంద్రం జర్నలిస్టుల జీవనోపాధిపై దాడి చేస్తోందని విమర్శించారు. వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడేందుకు ప్రతిఒక్కరూ న్యూస్‌క్లిక్‌పై దాడిని ఖండించాలని కోరారు. అలాగే తక్షణమే ప్రబీర్ పుర్కాయస్థను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

34 మందితో టిడిపి రెండో జాబితా

- సీనియర్లకు దక్కని చోటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అభ్యర్థుల రెండో జాబితా విడుదలైంది. 34 నియోజకవర్గాల అభ్యర్థులను ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. పొత్తులో భాగంగా టిడిపి 144 సీట్లలో పోటీ చేయనుంది. ఇప్పటి వరకు 128 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించారు. మరో 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వీటిల్లో కొన్ని పొత్తులో భాగంగా ముడిపడి ఉన్నాయి. మరికొన్ని నేతల మధ్య పోటీ ఉండటంతో వెల్లడించడం లేదు. కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వంటి సీనియర్ నేతలకు ఈ జాబితాలోనూ చోటు దక్కలేదు. తమ పార్టీ అభ్యర్థులందరినీ ఆశీర్వదించి గెలిపించాలని చంద్రబాబు రాష్ట్ర ప్రజలను ఎక్స్ (ట్విట్టర్)లో కోరారు.

టిడిపి అభ్యర్థులు

సంఖ్య	నియోజకవర్గం	అభ్యర్థి
1	నరసన్నపేట	బగ్గు రమణమూర్తి
2.	గాజువాక	పల్లా శ్రీనివాసరావు
3.	చోడవరం	కెఎస్ఎన్ఎస్ రాజు
4.	మాడుగుల	పైలా ప్రసాద్
5.	ప్రత్తిపాడు	వరుపుల సత్యప్రభ
6.	రామచంద్రాపురం	వాసంశెట్టి సుభాష్
7.	రాజమండ్రి రూరల్	గోరంట్లబుచ్చయ్య చౌదరి
8.	రంపచోడవరం (ఎస్‌టి)	మిర్యాల శిరీష
9.	కొవ్వూరు (ఎస్‌సి)	ముప్పిడి వెంకటేశ్వరరావు
10.	దెందులూరు	చింతమనేని ప్రభాకర్
11.	గోపాలపురం (ఎస్‌సి)	మద్దిపాటి వెంకటరాజు
12.	పెద్దకూరపాడు	భాష్యం ప్రవీణ్
13.	గుంటూరు వెస్ట్	పిడుగురాళ్ల మాధవి
14.	గుంటూరు ఈస్ట్	మహ్మద్ నజీర్
15.	గురజాల	యరపతినేని శ్రీనివాసరావు
16.	కందుకూరు	ఇంటూరి నాగేశ్వరరావు
17.	మార్కాపురం	కందుల నారాయణరెడ్డి
18.	గిద్దలూరు	అశోక్ రెడ్డి
19.	ఆత్మకూరు	ఆనం రామనారాయణ రెడ్డి
20.	కొవ్వూరు	వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
21.	వెంకటగిరి	కురుగొండ్ల లక్ష్మిప్రియ
22.	కమలాపురం	పుత్తా చైతన్యరెడ్డి
23.	ప్రొద్దుటూరు	వరదరాజుల రెడ్డి
24.	నందికొట్కూరు (ఎస్‌సి)	గిత్తా జయసూర్య
25.	ఎమ్మిగనూరు	జయనాగేశ్వరరెడ్డి
26.	మంత్రాలయం	రాఘవేంద్ర రెడ్డి
27.	పుట్టపర్తి	పల్లె సింధూరా రెడ్డి
28.	కదిరి	కందికుంట యశోదా దేవి
29.	మదనపల్లి	షాజహాన్ బాషా
30.	పుంగనూరు	చల్లా రామచంద్రారెడ్డి (బాబు)
31	చంద్రగిరి	పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)
32.	శ్రీకాళహస్తి	బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి
33.	సత్యవేడు (ఎస్‌సి)	కోనేటి ఆదిమూలం
34.	పూతలపట్టు (ఎస్‌సి)	కలికిరి మురళి మోహన్

హక్కుల సాధనకు ఉద్యమాలే శరణ్యం

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఏ ప్రభుత్వము అధికారంలో ఉన్నా హక్కుల సాధన కోసం ఉద్యమాలే శరణ్యమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో గురువారం స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర 48వ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలతో ప్రజాస్వామ్య బద్ధంగా చర్చించి, సమస్యల పరిష్కరించాలని, అడిషనల్ క్వాంటమ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా సంఘాలతో చర్చించకపోవటం వల్లే అనేక సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోవట్లేదన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఎ అరియర్స్, అడిషనల్ క్వాంటమ్‌పై ఈ నెలఖారులోగా ఉత్తర్వులు జారీ అవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎపి జెఎసి మాజీ ఛైర్మన్ బండి శ్రీనివాసరావు, ఎపి జెఎసి ఛైర్మన్ కెవి శివారెడ్డి, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడు మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా డి వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులుగా జిఎస్ అబ్దుల్ కరీం, సెక్రెటరీ జనరల్‌గా జి ప్రభుదాసు, కోశాధికారిగా శర్మ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బి పెద్దన్నగౌడ్ తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు భూములు విక్రయించారో లేదో చెప్పండి

కేంద్రానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత దానికి చెందిన భూములు ఏమైనా విక్రయించారా? అని హైకోర్టు ప్రశ్నించింది. విక్రయించి ఉంటే ఏ మేరకు అమ్మిందీ కూడా వివరించాలని కోరింది. ఈ విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. భూముల అమ్మకాల వివరాలను తమ ముందుంచాలని స్టీల్ ప్లాంటు యాజమాన్యాన్ని ఆదేశించింది. భూములను ఇతరులకు విక్రయించారని ఆరోపిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందుంచాలని పిటిషనరు కెఎ పాల్‌ను ఆదేశించింది. విశాఖ స్టీల్ ప్లాంటును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసే ఆలోచనలో ఉన్నదీ లేనిదీ చెప్పాలంది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. విశాఖ స్టీల్ ప్లాంటును అమ్మేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కెఎ పాల్, మాజీ ఐపిఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఇతరులు వేర్వేరుగా పిల్స్ దాఖలు చేశారు. పాల్ స్వయంగా వాదనలు వినిపిస్తూ, విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లో ఉందో నష్టాల్లో ఉందో తేల్చేందుకు హైకోర్టు రిటైర్డు జడ్జి ఆధ్వర్యాన కమిటీ వేయాలని కోరారు. ఇప్పటికే రెండు వేల ఎకరాల భూములను అమ్మేశారని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. అభియోగాలు చేయడం కాదని, ఆధారాలు చూపాలని పేర్కొంది.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకమని ఎజి ఎస్ శ్రీరామ్ చెప్పారు. భూములిచ్చిన వారు నష్టపోకూడదని అన్నారు. లాభాల్లోకి తేవడానికి ప్రభుత్వం పలు సూచనలతో లేఖ రాసిందన్నారు. స్టీల్ ప్లాంట్ భూములను విక్రయించలేదని కేంద్రం తరఫు న్యాయవాది చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామని చెప్పడంతో విచారణ ఈ నెల 22కు వాయిదా పడింది.

స్థానికులకు 75 శాతం ఉద్యోగాలపై పిల్

పరిశ్రమలు, కర్మాగారాల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు తప్పనిసరిగా ఇవ్వాలని పేర్కొంటూ 2019లో రాష్ట్రం ప్రభుత్వం చేసిన చట్టాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎపి టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్, వసంత ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్ దాఖలు చేశాయి. దీనిని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం

ప్రజాశక్తి-అమరావతి

హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ బివివిఎస్ చక్రవర్తి, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావుతో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. మొదటి కోర్టు హాల్లో ప్రమాణ స్వీకారం జరిగింది. న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, రిజిస్ట్రార్లు, సిబ్బంది పాల్గొన్నారు. వారిద్దరూ 2022 ఆగస్టు 4న హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. వాళ్లను శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ఈ నెల 10న ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు.



లలితమ్మ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి

ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి మాతృవియోగం

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నివాళి

ప్రజాశక్తి-ఉరవకొండ టౌన్

అనంతపురం జిల్లాకు చెందిన వైసిపి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాతృమూర్తి ఎల్లారెడ్డి లలితమ్మ (85) బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో ఆమె మరణించారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. లలితమ్మ మృతి విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి...కొనకొండ్ల గ్రామానికి చేరుకుని లలితమ్మ భౌతికకాయాన్నికి నివాళులర్పించారు. ఆమెకు ఐదుగురు కుమారులు ఉన్నారు. ఎమ్మెల్సీగా శివరామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డిలు ఆదోని, మంత్రాలయం, గుంతకల్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మరో కుమారుడు సీతారామిరెడ్డి టిటిడి బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి ఉష శ్రీచరణ్, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, శంకరనారాయణ, జడ్‌పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు లలితమ్మకు నివాళులర్పించారు.

టిటిడి పరువు నష్టం కేసు 27కు వాయిదా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్రజ్యోతిపై తిరుమల తిరుపతి దేవస్థానం వేసిన పరువు నష్టం కేసు విచారణ ఈ నెల 27కు వాయిదా పడింది. టిటిడి వెబ్‌సైట్‌లో అన్యమత ప్రచారం చేస్తున్నారంటూ ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రచురించిన కథనాలపై టిటిడి కేసు పెట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో బిజెపి నేత, మాజీ ఎంపి సుబ్రమణ్యం స్వామి ఆంధ్రజ్యోతి దినపత్రికపై వంద కోట్ల పరువు నష్టం దావా కేసును దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి గురువారం తిరుపతి కోర్టుకు ఆయన హాజరయ్యారు. తదుపరి విచారణను న్యాయమూర్తి 27కు వాయిదా వేశారు.

బలవంతపు సెలవులు తగవు : ఇయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో బస్సుల్లేక స్పేర్‌లో వున్న ఉద్యోగులను బలవంతంగా సెలవులపై పంపే చర్యలను విడనాడాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య గురువారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కాలంలో తరచూ ప్రభుత్వం ఆధ్వర్యాన జరుగుతున్న సభలకు, ఇతర కార్యక్రమాలకు బుకింగ్‌లపై బస్సులు వెళ్లినపుడు, బస్సులు రిపేరులు వున్నప్పుడు కండక్టర్లకు, డ్రైవర్లకు ట్రాఫిక్ సూపర్‌వైజర్లు బలవంతంగా సెలవులు రాస్తున్నారని ఎమ్‌డి దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది స్పేర్‌లో వుంటే ఇతర విధుల్లో పనిచేయించాలి తప్ప బలవంతంగా సెలవులు రాయడం సరికాదన్నారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా బలవంతపు సెలవుల ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పని

సిపిఎం అల్లూరి జిల్లా విస్తృత సమావేశంలో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రానున్న ఎన్నికల్లో అరకు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల్లో సిపిఎం అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో గురువారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాటాలు చేసిన చరిత్ర సిపిఎంకు ఉందన్నారు. ఇన్నాళ్ల పోరాటానికి ఫలితం పొందే సమయం వచ్చిందని తెలిపారు. బిజెపికి కొమ్ముకాసే పార్టీలన్నింటినీ ఓడించాలని పిలుపునిచ్చారు. టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో కలిసి ఎన్నికల్లో వస్తున్నాయని, గెలిచిన తర్వాత వైసిపి కూడా బిజెపి భజన చేస్తుందని తెలిపారు.

వీరెవరినీ ప్రజలు నమ్మవద్దన్నారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పు అరకు నుంచే ప్రారంభం కావాలని ఆయన ఆకాంక్షించారు. 2014లో టిడిపిని ప్రజలు గెలిపిస్తే చంద్రబాబు ఏ అభివృద్ధి పనులైనా చేశారా? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా అంశాన్ని తాకట్టు పెట్టేశారని తెలిపారు. రాష్ట్రానికి చంద్రబాబు చేసిన ద్రోహం వల్లే 2019 ఎన్నికల్లో ప్రజలు వైసిపిని గెలిపించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే పంథాలో నడుస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఒకటిరెండు పార్లమెంట్ స్థానాల్లో, 10 నుంచి 15 అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం పోటీ చేయనుందని తెలిపారు. అభ్యర్థుల పేర్లు రెండు రోజుల్లో ప్రకటిస్తామని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స, కార్యదర్శివర్గ సభ్యులు బి.చిన్నయ్యపడాల్, దీసరి గంగరాజు, వి.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

'ఆరణి' గో బ్యాక్

- తిరుపతిలో నాన్‌'లోకల్' వార్..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి అసెంబ్లీ టికెట్‌ను జనసేనతో పొత్తులో భాగంగా ఆ పార్టీకి కేటాయించారు. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టి, జనసేనలోకి వలసొచ్చిన చిత్తూరు వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ప్రకటించడంతో ఆ పార్టీలో కలకలం మొదలైంది. 'ఆరణి గోబ్యాక్' అంటూ తిరుపతి నగర వీధుల్లో బ్యానర్లు వెలిశాయి. 'స్థానిక' టిడిపి, జనసేన నేతలు గురువారం తిరుపతిలోని ఓ హోటల్లో సమావేశమయ్యారు. పెద్దిరెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి కోవర్ట్‌గా ఉన్న ఆరణి శ్రీనివాసులు పార్టీ మారగానే అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. శుక్రవారం మరోసారి సమావేశమై తమ నిర్ణయాన్ని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని వారు నిర్ణయించుకున్నట్లు సమాచారం. 2009లో పిఆర్‌పి తరుపున చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అరణి పోటీచేసి రెండో స్థానంలో నిలిచారు. తిరుపతి పద్మావతిపురంలో సొంత ఇల్లు ఉండి, బంధుగణం ఉంటే పోటీచేయడానికి ఎలా అనర్హుడవుతారని అరణి అనుచరులు ప్రశ్నిస్తున్నారు.





పిఠాపురంలో టిడిపి శ్రేణుల ఆందోళన

పిఠాపురంలో టిడిపి శ్రేణుల ఆందోళన

- పోస్టర్లు, ఫ్లెక్సీలు, టిడిపి జెండాలకు నిప్పు
- జనసేనకు టికెట్ కేటాయింపుపై ఆగ్రహం

ప్రజాశక్తి - పిఠాపురం(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్నట్టు చేసిన ప్రకటన టిడిపి శ్రేణుల్లో నిప్పును రాజేసింది. పవన్‌కల్యాణ్ ప్రకటన చేయగానే పట్టణంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్థానిక రాజు గారి కోటలో ఉన్న టిడిపి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు, కరపత్రాలను రోడ్డుపైకి తెచ్చి కుప్పగాపోసి తగులబెట్టారు. రెండు దశాబ్దాలుగా పార్టీలో ఉంటూ నిబద్ధతో పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్‌ఎన్ వర్మకి కాకుండా జనసేనకు టికెట్ కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. చంద్రబాబు, లోకేష్, నారా భువనేశ్వరి ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను చించి మంటల్లో వేశారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు మాట్లాడారు. గత ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయారని, ముందు ఆ స్థానాల్లో గెలిచి తర్వాత పిఠాపురం నుంచి పోటీ చేయాలని హితవు పలికారు. తమ మద్దతు వర్మకే ఉంటుందని నినదించారు.

సంయమనం పాటించాలి : వర్మ

నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ టికెట్ విషయంలో పవన్ కల్యాణ్, చంద్రబాబును విమర్శించొద్దని అన్నారు. కుటుంబాన్ని, వ్యాపారాలను వదులుకుని పార్టీ కోసం రెండు దశాబ్దాలుగా పనిచేశానని తెలిపారు. గత ఎన్నికల్లో ఓడినప్పటికీ నిత్యం ప్రజల మధ్యనే ఉన్నానని గుర్తు చేశారు. శుక్రవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు.



మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

పైపులైన్లు తొలగించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తాం

- రోడ్డుపై బైఠాయించి మత్స్యకారుల నిరసన
- మద్దతు తెలిపిన ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

అరబిందో ఫార్మా పరిశ్రమలోని వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు వేసిన పైపులైన్లను వెంటనే తొలగించాలని, లేకుంటే రానున్న ఎన్నికలను బహిష్కరిస్తామని కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం మత్స్యకారులు హెచ్చరించారు. పైపులైన్లను తొలగించాలంటూ గురువారం కొనపాపపేటలోని బీచ్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వారికి ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మద్దతు తెలిపారు. అనంతరం ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, రాష్ట్ర సహాయక కార్యదర్శి సిహెచ్ రమణి, జిల్లా నాయకులు ఉప్పాడ సత్యనారాయణతో కలిసి ఆమె బోటుపై సముద్ర మార్గం గుండా వెళ్లి పైపులైను పనులు పరిశీలించారు. అనంతరం తిరిగి శిబిరం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ అరబిందో ఫార్మా పరిశ్రమ సముద్రంలోకి వేసిన పైపులైన్ల వల్ల మత్స్యసంపదకు నష్టం వాటిల్లితుందన్నారు. పైపులైన్ల వల్ల వలలు, బోట్లు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. వారం రోజులుగా మత్స్యకారులు నిరసన తెలుపుతున్నా అధికారులు, పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. వెంటనే పైపులైన్లను తొలగించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కొల్లాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పైపులైన్ ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి వదలడంతో మత్స్యకారుల జీవన ఉపాధికి ఆటంకం కలుగుతుందన్నారు. సమస్యను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. కొనపాపపేట బీచ్ రోడ్డుపై మత్స్యకారుల ఆందోళనతో వాహనాలు నిలిచిపోయాయి.

మిడ్డే మీల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ ప్రధాన కార్యదర్శి డి రమాదేవి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల (మిడ్డే మీల్ వర్కర్స్) సమస్యలు పరిష్కరించాలని, సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు.

విజయవాడలోని మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుధ్యం ఎమ్‌డిఎమ్ శ్రీనివాస్‌ను గురువారం యూనియన్ నాయకులు, ఇతర వర్కర్లతో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారని, ఇంతవరకు ఆ హామీని అమలు చేయలేదని తెలిపారు. ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, మెనూ ఛార్జీలు రూ.20లకు పెంచాలని కోరారు. కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని, ఉద్యోగ భద్రతతోపాటు, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. సెలవుల మంజూరుతోపాటు, మెటర్నిటి బెనిఫిట్స్, రిటైర్మెంటు బెనిఫిట్స్ కూడా కల్పించాలని అన్నారు. ఈ అంశాలపై ఎమ్‌డిఎమ్ శ్రీనివాస్ సానుకూలంగా స్పందించి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రమాదేవి తెలియజేశారు.

5,423 మారుమూల గ్రామాల్లో 4జి సేవలు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఫేజ్-2 కింద 5,423 మారుమూల గ్రామాల్లో 4జి సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. 4జి సర్వీసులకు సంబంధించి నెట్‌వర్క్ టవర్ల ఏర్పాటు, ఇతర పనుల ప్రగతిపై గురువారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న సిఎస్ జవహర్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రగతి గురించి ఆయనకు వివరించారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో 4జి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూనివర్సల్ సర్వీసు ఆబ్లిగేషన్ ఫండ్ (యుఎస్ఒఎఫ్) ద్వారా బిఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్ సంస్థలకు టవర్ల ఏర్పాటుకు సంబంధించి అనుమతులు జారీ చేసి, స్థలాలను అప్పగిస్తున్నామని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 2,329 టవర్ల ఏర్పాటుకు దరఖాస్తులు రాగా.. వాటిలో 2,316 స్థలాలు అప్పగించామని ఆయన తెలియజేశారు. 15 రోజులకోసారి జిల్లా కలెక్టర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బిఎస్‌ఎన్‌ఎల్‌లో క్షేత్రస్థాయిలో సిబ్బంది తక్కువగా ఉన్నారని, తగినంత సిబ్బందిని సమకూర్చితే పనులు మరింత వేగవంతంగా పూర్తి చేస్తామని చెప్పారు. దీనిపై స్పందించిన కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ.. బిఎస్‌ఎన్‌ఎల్ రాష్ట్రస్థాయి అధికారులు వెంటనే ఎపి సిఎస్‌తో చర్చలు జరిపి, తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు రాజీవ్ గౌబ మాట్లాడుతూ.. మారుమూల గ్రామల ప్రజలకు 4జి సర్వీసులు అందించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 27 వేల మొబైల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టవర్ల ఏర్పాటుకు సంబంధించి ఏమైనా అడ్డంకులుంటే వెంటనే అటవీ, తదితర శాఖలతో మాట్లాడి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

పేటియంలో 20% ఉద్యోగులపై వేటు

- నేటి నుంచి పిపిబిఎల్‌పై ఆర్‌బిఐ ఆంక్షలు

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగించిందని సమాచారం. సంస్థల్లో పని చేస్తున్న 20 శాతం మంది సిబ్బందిపై వేటు వేసిందని రిపోర్టులు వస్తోన్నాయి. మార్చి 15 నుంచి పేటియం పేమెంట్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ ఆంక్షలు ప్రారంభం కావడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పొదుపు చర్యల్లో భాగంగా ఇటీవలే 1000 మందిని తొలగించిన పేటియం తాజా చర్యలు ఆ సంస్థ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఉద్యోగుల వార్షిక పనితీరు ఆధారంగా వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారిని తొలగించాలని నిర్ణయానికి వచ్చింది. కాగా.. తన వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత సొల్యూషన్స్ అమలుపై కేంద్రీకరించడం కూడా ఉద్యోగుల తొలగింపునకు మరో కారణమని ఆ సంస్థ లీకులు ఇచ్చినప్పటికీ.. అసలు కారణాలు వేరే ఉన్నాయని తెలుస్తోంది. తొలగింపులు అంశంపై హెచ్‌ఆర్ విభాగం అధికారులు వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఒక్కొక్కరిని పిలిచి సమాచారం ఇస్తున్నారు.

పేటియం పేమెంట్స్ బ్యాంకింగ్ లిమిటెడ్‌పై శుక్రవారం నుంచి ఆర్‌బిఐ ఆంక్షలు అమల్లోకి రానున్న నేపథ్యంలో గురువారం స్టాక్ మార్కెట్లలో ఓ దశలో పేటియం షేర్ విలువ 5 శాతం శాతం పతనమైంది. బిఎస్ఇలో తుదకు స్వల్ప నష్టంతో రూ.350.65 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.334-362 మధ్య కదలాడింది. గడిచిన ఐదు సెషన్లలో 11.99 శాతం నష్టపోయింది. థర్డ్ పార్టీ పేమెంట్ యాప్‌గా అనుమతించాలని పేటియం పెట్టుకున్న దరఖాస్తును నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) పరిశీలిస్తున్న వన్97 కమ్యూనికేషన్స్ షేర్ పతనం కావడం గమనార్హం. ప్రస్తుతం పేటియం ఫాస్టాగ్ ఉపయోగిస్తున్న వినియోగదారులు ఇతర విత్త సంస్థల వద్ద కొత్త ఫాస్టాగ్ తీసుకోవాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) సూచించింది. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని నివారించేందుకు, ప్రయాణం సులభతరం చేసేందుకు మార్చి 15లోగా ఏదైనా బ్యాంకు నుంచి కొత్తగా ఫాస్టాగ్ తీసుకోవాలని బుధవారం తన అడ్వైజరీలో పేర్కొన్న విషయం తెలిసిందే.



ప్రభుత్వ సిఫార్సు బదిలీలు రద్దు చేయాలి

- యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల పోరాటాల ద్వారా సాధించుకున్న కౌన్సెలింగ్ విధానాన్ని అపహాస్యం చేస్తూ ప్రభుత్వమే సిఫార్సు బదిలీలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యుటిఎఫ్ వెల్లడించింది. ఈ బదిలీలను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ విధంగా సిఫార్సు బదిలీలు చేయడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందా? అని ప్రశ్నించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, హిందీ, తెలుగు పండిట్ల ప్రమోషన్లు, వివిధ జిల్లాల్లో పెండింగ్‌లో ప్రమోషన్లు ఇవ్వటానికి నిబంధనలు ఆటంకంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌తో సంబంధం లేకుండా సిఫార్సు బదిలీలు చేయడానికి ఏ నిబంధనలూ ఆటంకం కావడం లేదా? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల కోరిక మేరకే బదిలీలు చేస్తున్నామన్న ప్రభుత్వం, అదే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు వద్దని చెబుతున్న జిఓ 117, అప్రెంటీస్ విధానాన్ని ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. సుమారు 1200పైగా ప్రభుత్వం ఇలాంటి బదిలీలు చేయడం విద్యారంగానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిగే కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచే ఈ బదిలీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సీల్డ్ కవర్ బదిలీలు ఆపాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ మరో ప్రకటనలో డిమాండ్ చేసింది. అక్రమ బదిలీలు జరగడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ పేర్కొన్నారు.

ఎసిబికి పట్టుబడ్డ ఆరిలోవ ఎస్ఐ

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని ఆరిలోవ ఎస్ఐ ఎసిబికి పట్టుబడ్డారు. ఎసిబి అధికారుల సమాచారం మేరకు..ఓ వ్యక్తి తన కారును మరో వ్యక్తికి విక్రయించారు. అయితే కొనుగోలు చేసిన వ్యక్తి ఫైనాన్స్ సరిగా చెల్లించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఇరువురినీ పిలిచి ఆరిలోవ ఎస్ఐ హరికృష్ణ కేసు సెటిల్ చేశారు. ఇందుకుగాను తనకు రూ.పది వేలు లంచం ఇవ్వాలని ఎస్ఐ డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని కారు కొనుగోలు చేసిన వ్యక్తి చెప్పడంతో ఆయన సెల్‌ఫోన్‌ను ఎస్ఐ బలవంతంగా తీసుకున్నారు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ లంచం తీసుకుంటుండగా ఎసిబి అడిషనల్ ఎస్‌పి శ్రావణి ఆధ్వర్యంలో డిఎస్‌పి రమ్య, సిఐ ప్రేమ్‌కుమార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

గీతాంజలి ఆత్మహత్య కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గీతాంజలి ఆత్మహత్య కేసులో ఎన్‌టిఆర్, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్‌పి తుషార్‌దూడి తెలిపారు. పోలీస్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల నాలుగున ప్రభుత్వ ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రం అందుకున్న సందర్భంగా ఓ ఛానల్‌కు ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారని తెలిపారు. అయితే కొంతమంది వ్యక్తులు ఆమెపై సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో పోస్టింగ్‌లు పెట్టారని, దీంతో ఆమె మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. సోషల్ మీడియాలో గీతాంజలిని వేధింపులకు గురిచేసిన విజయవాడ వాసి పసుమర్తి రాంబాబు, పశ్చిమగోదావరి జిల్లా ఉండికి చెందిన పెనుమజ్జి వెంకట దుర్గారావులను అరెస్టు చేసినట్టు తెలిపారు.

పోకో నుంచి ఎక్స్6 నియో

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ పోకో మార్కెట్లోకి పోకో ఎక్స్6 నియోను విడుదల చేసింది. 8జిబి ర్యామ్, 128 జిబి స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.17,999గా నిర్ణయించింది. మార్చి 18 నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో లభ్యమవుతుందని తెలిపింది. 108 ఎంపి ప్రైమరీ సెన్సార్, 2ఎంపి డెప్త్ కెమెరాలు సహా సెల్ఫీ కోసం 16 ఎంపి కెమెరాను ఇందులో అమర్చినట్లు పేర్కొంది.

హెచ్ఐఎల్ చేతికి క్రిస్టియా పాలిటెక్ సంస్థ

న్యూఢిల్లీ : సికె బిర్లా గ్రూపునకు చెందిన హెచ్ఐఎల్ లిమిటెడ్ తాజాగా క్రిస్టియా పాలిటెక్‌కు చెందిన టాప్‌లైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. కాగా వీటిని రూ.265 కోట్లకు స్వాధీనం చేసుకుంది. ఈశాన్య భారత్‌లో పైపులు, ఫిట్టింగ్స్ పరికరాల విక్రయాల్లో కీలక బ్రాండ్‌గా ఉంది. క్రిస్టియా పాలిటెక్ ప్రధానంగా టాప్‌లైన్ ఇండస్ట్రీస్, ఆదిత్యా పాలిటెక్నిక్, ఆదిత్యా ఇండస్ట్రీస్, సాయినాథ్ పాలిమర్స్ సబ్సీడరీలను కలిగి ఉంది. 2023-24లో రూ.330 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేశాయి.

రిలయన్స్ చేతికి పారామౌంట్ వాటా

న్యూఢిల్లీ : వయాకామ్18లో పారామౌంట్ గ్లోబల్‌కు ఉన్న 13 శాతం వాటాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనుగోలు చేయనుంది. ఇప్పటికే వాల్ట్ డిస్నీతో తమ మీడియా వ్యాపార కార్యకలాపాలను విలీనం చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. భారత టివి వ్యాపారంలో తమకున్న వాటాలను రిలయన్స్‌కు విక్రయించనున్నట్లు అమెరికాకు చెందిన పారామౌంట్ గ్లోబల్ తెలిపింది. దీనిపై ఇప్పటికే ఇరు సంస్థలు ఓ ఒప్పందానికి వచ్చాయి. దీనికి నియంత్రణా సంస్థల అనుమతులు లభించాల్సి ఉంది. వయాకామ్ 18 మీడియా ప్రయివేటు లిమిటెడ్‌లో పారామౌంట్ గ్లోబల్‌కున్న 13.1 శాతం వాటాలను రూ.4,286 కోట్లతో కొనుగోలు చేసేందుకు ఒప్పందం ఖరారు చేసుకున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. దీంతో వయాకామ్‌లో రిలయన్స్ వాటా 70.49 శాతానికి పెరుగుతుంది.



ఫిలిప్పీన్స్‌లో నెఫ్రోప్లస్ విస్తరణ

రెనల్ థెరపీ సొల్యూషన్స్ స్వాధీనం

హైదరాబాద్ : ప్రముఖ డయాలసిస్ సేవల సంస్థ నెఫ్రోప్లస్ ఫిలిప్పిన్స్‌లో తన సేవలను మరింత విస్తరించింది. ఆ దేశంలోని రెనల్ థెరఫీ సొల్యూషన్స్‌ను స్వాధీనం చేసుకోవడం మరో ఆరు క్లినిక్‌లను పెంచుకున్నట్లయ్యింది. దీంతో అక్కడ 27 శాఖలకు విస్తరించినట్లయ్యింది. ఇప్పటికే భారత్, నేపాల్, ఉజ్బకిస్తాన్, ఫిలిప్పిన్స్ దేశాల్లో కీలక కార్యకలాపాలను కలిగి ఉంది. కిడ్నీ రోగులకు మరింత మెరుగైన సేవలను అందించాలనే తమ లక్ష్యంలో భాగంగా సామర్థ్యాన్ని పెంచుకుంటూ 14 ఏళ్లుగా ఈ రంగంలో రాణిస్తున్నామని నెఫ్రోప్లస్ సిఇఒ, వ్యవస్థాపకులు విక్రమ్ వుప్పల పేర్కొన్నారు. ఫిలిప్పిన్స్ ప్రజలకు మరింత నాణ్యమైన డయాలసీస్ సేవలను అందించనున్నామన్నారు.



వచ్చే ఏడాది 7% వృద్ధి

ఫిచ్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25లో భారత వృద్ధి రేటు 7 శాతంగా ఉండొచ్చని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. దేశీయంగా పెరిగిన డిమాండ్, వ్యాపారం స్థిరంగా కొనసాగడమే ఇందుకు కారణమని పేర్కొంది. ప్రస్తుత 2023-24లో 7.8 శాతం పెరుగుదల ఉండొచ్చని అంచనా వేసింది. గడిచిన మూడు త్రైమాసికాలుగా దేశీయంగా 8 శాతం కంటే అధికంగా జిడిపి పెరుగుతోందని.. చివరి త్రైమాసికంలోనూ అదే స్థాయిలో ఉండొచ్చని ఫిచ్ పేర్కొంది.



సంపాదకీయం

హర్యానా నాటకం!

కమ్ముకొస్తున్న ప్రభుత్వ వ్యతిరేకత నుంచి ఉపశమనం పొందటానికి హర్యానాలో ముఖ్యమంత్రి మార్పు నాటకాన్ని బిజెపి పూర్తి చేసింది. దాదాపు పదేళ్ల పాటు పీఠం మీద ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్‌ని దించి, ఆ స్థానే ఐదు నెలల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన ఎంపీ నయాబ్ సింగ్ సైనీని కొత్త ముఖ్యముంత్రిగా కూర్చోబెట్టింది. 90 స్థానాలున్న శాసనసభలో బిజెపి బలం 41కీ, మరో ఏడుగురు స్వతంత్రులు మద్దతు ఇవ్వడంతో సైనీ పట్టాభిషేకం పూర్తయింది. ఖట్టర్‌ని మార్చటానికి మిత్రపక్షమైన జెజెపితో అతడికి పొసగకపోవటమే ప్రధాన కారణమన్నట్టుగా పైకి ప్రచారం జరుగుతున్నా- బిజెపి అసలు వ్యూహం వేరే ఉంది. ఏ రాష్ట్రం బాగోగులైనా ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్న పార్టీ అనుసరించే విధానాలపై ఆధారపడి ఉంటాయి. ఆ ప్రభుత్వం ప్రజల అవసరాలనూ, ఆకాంక్షలనూ నెరవేర్చటంతో ముడిపడి ఉంటాయి. ఆ కొలమానాలతో హర్యానా బిజెపి ప్రభుత్వపు పనితీరును కొలిచినప్పుడు - అదెంత నాసిరకంగా ఉందో అవగతమవుతుంది. ఈ తరహా అంచనా కమలనాధులకు కూడా ఉండడం వల్లే 'మార్పు' రాజకీయం ముందుకొచ్చింది!

బిజెపి 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హర్యానాలో అనేక వివాదాలు కొనసాగుతున్నాయి. 2016లో జాట్ రిజర్వేషన్ల ఆందోళనలో 30 మంది చనిపోయారు. గుర్మీత్ రామ్ రహీమ్ అరెస్టు తర్వాత అతడి అనుచరుల హింసాత్మక చర్యల్లో 40 మంది ప్రాణాలు కోల్పోయారు. కోట్లాది రూపాయల ఆస్తినష్టం సంభవించింది. మైనార్టీల మీద నిరంతర దాడులు, దళితులపై దౌర్జన్యాలూ వంటి దుశ్చర్యలతో రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానస్థితికి చేరాయి. పడక్బందీగా నిర్వహించాల్సిన పరీక్షల విషయంలో కూడా ప్రభుత్వం అప్రతిష్ట పాలైంది! సీబీఎస్‌ఈ సహా వివిధ పరీక్షల ప్రశ్నపత్రాలు 34 సార్లు లీకయ్యాయంటే- విద్యార్థుల భవిష్యత్తు పట్ల ప్రభుత్వ పెద్దల బాధ్యతారాహిత్యం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవొచ్చు! యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో బిజెపి విఫలమైంది. సైన్యంలో చేరటం ఒక సాంప్రదాయక వరవడిగా ఉన్న ఈ రాష్ట్రంలో అగ్నివీర్ పథకం సృష్టించిన అసంతృప్తి ఎక్కువగానే ఉంది. నల్లచట్టాల మీద రైతులు వీరోచితంగా పోరాడుతుంటే అణచివేయటానికి ఖట్టర్ ప్రభుత్వం అనేక విధాలుగా తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. రెజ్లర్ పోరాటం మీదా నిందలూ, నియంత్రణలూ అడ్డూ అదుపూ లేకుండా సాగించింది. వీటన్నింటి కారణంగా బిజెపి ఏలుబడిపై రైతుల్లో, ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత గూడుకట్టుకొని ఉంది. ఈ నేపథ్యంలోనే ఖట్టర్‌ని మార్చటం ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించుకోవాలని, ప్రజల దృష్టిని మళ్లించాలని బిజెపి ఎత్తు వేసింది. తమ ప్రభుత్వాలు ప్రజాభిమానాన్ని కోల్పోతున్న దశలో ఈ తరహా ముఖ్యమంత్రి మార్పు మంత్రాంగాన్ని 2021 నుంచి బిజెపి అనుసరిస్తోంది. ఎన్నికలకు కొద్ది కాలం ముందు ఉత్తరాఖండ్, గుజరాత్, త్రిపుర, కర్నాటకలలో ఇలాంటి ప్రహసనమే సాగించింది. కర్నాటకలో 2023 ఎన్నికలకు ముందు యడ్యూరప్పను మార్చి బొమ్మయ్‌ని ముందుకు తెచ్చింది. అయితే, అప్పటికే తీవ్రంగా అభాసుపాలైన బిజెపికి, శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పలేదు! హర్యానాలో మాత్రం శాసనసభలో 30 స్థానాలు ఉన్న కాంగ్రెస్ పార్టీ ... బిజెపి వైఫల్యాలను ప్రజలకు వివరించి, వారి ఆమోదం పొందటానికి బదులు అంతర్గత విభేదాలతో సతమతం అవుతోంది.

2019 సార్వత్రిక ఎన్నికల్లో హర్యానాలో 10కి 10 లోక్‌సభ స్థానాలనూ బిజెపి కైవసం చేసుకొంది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డి) నుంచి ఒకప్పటి ఉప ప్రధాని దేవీలాల్ మనవడు దుష్యంత్ చీలిపోయి, జెపిపిని ఏర్పాటు చేయడం కమలనాధులకు కలిసొచ్చింది. వచ్చే ఎన్నికల్లో బిజెపి ఓట్లు తగ్గటం తప్ప పెరిగే పరిస్థితి లేదు. సీట్లు కొన్ని కోల్పోతామేమోనన్న భయం కూడా ఆ పార్టీని వెన్నాడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 27 శాతంగా ఉన్న జాట్ల ఓట్లను, ప్రజల అంతృప్తిని చీల్చటం ద్వారా ప్రతిపక్షానికి మేలు జరక్కుండా చూడటానికి జెపిపిని 'వ్యూహాత్మకం'గా విడివడేలా చేసినట్టు ప్రచారం జరుగుతోంది. దానిలో నిజానిజాలు ఎలా ఉన్నా- పాలనలో ప్రజాసంక్షేమం, అభివృద్ధి, యువతకు ఉద్యోగ కల్పన వంటివి లేకుండా- కేవలం ముఖ్యమంత్రి మార్పుతో ప్రజలకు ఒరిగేది ఏమీ ఉండదు.

మహనీయుల మాట




మతం, అధికారం ఈ రెండూ తోడు దొంగలు. ఇవి కలిసికట్టుగా జనాన్ని దోచుకుతింటున్నాయి. ఈ పని చేసే సమయంలో ఈ రెండూ మంచి ఒద్దికగా పనిచేస్తాయి. అందుకే మిక్కిలి దుష్ట ప్రభుత్వాన్ని మతం సమర్థిస్తుంది. మూర్ఖమూ, నీచమూ, మూఢమూ అయిన మతాన్ని ప్రభుత్వమూ సమర్థిస్తుంది.

- ఫాదర్ జాన్ మెల్యే,
17వ శతాబ్దపు కమ్యూనిస్టు ఫాదర్, పారిస్

కామన్‌సెన్స్


ఆయుష్మాన్ భారత్ అంటే...?



రామ్‌నామ్ కి లూట్ హై సకేతో లూట్ ..
అంత్‌కాల్ పఛ్‌తాయేగా జబ్ సత్తా జాయెగి ఛూట్ ...

అని కబీర్‌దాస్ దోహేను తిరగరాసుకుని రాముని పేరు చెప్పి..ప్రాణ ప్రతిష్ఠ పేరు చెప్పి..భక్తి పారవశ్యంలో తెలిపోతున్నట్టు నటిస్తూ..ఫొటో షూట్ చేసుకుంటూ..ప్రజల సొమ్మును తప్పుడు మార్గంలో దోచుకోవడం బిజెపి నాయకులకు అలవాటు. జడ్జిని చంపించిన క్రిమినల్, దేశ హోంమంత్రిగా-గుజరాత్, మణిపూర్ మారణకాండలు జరిపించిన వ్యక్తి ప్రధానిగా చలామణి అవుతున్నప్పుడు పరిస్థితులు నీతిమంతంగా సక్రమంగా ఉంటాయని ఎలా అనుకుంటాం? అమ్ముడుపోయిన ప్రధాన మీడియా నోరు మెదపకున్నా, నిజాయితీ నిబద్ధతగల మీడియా బిజెపి అక్రమాల్ని వెలుగులోకి తెస్తూనే ఉంది. వివేచనగల దేశ పౌరులు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి. దేశాన్ని ఫాసిజం వైపు నియంతృత్వం వైపు తీసుకుపోయే ప్రభుత్వం కావాలా? ప్రజాస్వామ్య బద్ధంగా అందరి హక్కుల్ని, స్వేచ్ఛని పరిరక్షించే ప్రభుత్వం కావాలా? ఆలోచించుకోవాలి! అలాంటి ప్రభుత్వాన్ని తెచ్చుకోవడానికి ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు సమైక్యంగా కృషి చేయాలి!!

కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా అవినీతి జరిగిందని ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో-బయటా చాలా సుదీర్ఘమైన ఉపన్యాసాలు ఇస్తుంటారు. 2జి, 3జి, 4జి వంటి అనేక స్కాంలు జరిగాయనీ, అప్పటి ప్రభుత్వం భ్రష్టుపట్టి పోయిందనీ ఒంటికాలి మీద లేస్తుంటారు. అవినీతి ఎక్కడ ఎప్పుడు జరిగినా బయటపెట్టడం మంచి పనే-అభినందించదగిందే!!. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇచ్చిన రిపోర్టు చూపించి ఆ ఆరోపణలు చేశారు. ఆ రోజుల్లో సిఎజి చీఫ్‌గా వినోద్ రాయ్ ఉన్నాడు. ఇక్కడ నవ్వుకోవాల్సిన పరిస్థితి ఏమిటంటే అంతగా అప్పుడు ఎగిరిపడ్డ బిజెపి ఆ అవినీతి నిరూపించి బాధ్యుల్ని జైలుకు పంపాలి కదా? మరి ఎందుకు పంపలేదూ? అది ఈనాటి ఈ బిజెపి ప్రభుత్వపు అసమర్థత కాదా? సరే. అప్పటి విషయం అలా ఉంచి. ఇప్పటి ఈ బిజెపి ప్రభుత్వం గురించి అదే కాగ్ ఇచ్చిన రిపోర్టు చూద్దాం! ప్రధాన మీడియా మోడీకి దాసోహమంటోంది గనక, ఇలాంటి విషయాలు అది బయటపెట్టదు. బాధ్యతగల స్వతంత్ర జర్నలిస్టులు సత్యాన్వేషణకు పూనుకున్న కొన్ని పత్రికలు అధికార బిజెపి అవినీతిని బయటపెడుతూనే ఉన్నాయి. స్వేచ్ఛాలోచనను బలపరిచే మనమూ-ఎవరు ఎక్కడ అవినీతికి పాలుపడ్డా, ఎవరెక్కడ నిజాయితీకి నిప్పు పెట్టినా స్పందిస్తూనే ఉండాలి కదా?


డా॥ దేవరాజు మహారాజు

ఎన్నికల బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బిజెపికి, మోడీ ప్రభుత్వానికి ఊపిరి ఆడకుండా చేసింది. ఇక, తాజా కాగ్ నివేదిక ప్రకారం 'ఆయుష్మాన్ భారత్' పేరుతో బిజెపి ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో బయటపడింది. ఈ పథకాన్ని ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పిఎంజెఎవై) అంటారు. దీనితో భారతీయ పౌరులకు, ముఖ్యంగా పేదలకు ఆరోగ్య సమస్యలేవైనా ఉంటే, చికిత్స కోసం భారత ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఉచితంగా ఖర్చు చేస్తుంది. ఆరోగ్య పథకం బావుంది. దేశ ప్రజల ఆరోగ్యం చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే-అందులో సందేహం లేదు! కానీ, అది నిర్వహించబడుతున్న తీరు ఎలాగుందో అధ్యయనం చేసి కాగ్ నివేదిక విడుదల చేసింది. ఈ పథకం (స్కీం)లో ప్రయోజనం పొందాలనుకునే వారు మొదట పిఎంజెఎవై ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు తీసుకోవాలి. తర్వాత ఆ స్కీంలో రిజిస్టర్ చేసుకోవాలి. అంటే తమ పేరు అందులో నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత చికిత్స చేయించుకోవాలి. ఎంత పెద్ద ఆసుపత్రిలోనైనా సరే-వచ్చే ఖర్చులో రూ. ఐదు లక్షలు భారత కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీనితో అట్టడుగు పేదలకూ ఖర్చు భరించలేని మధ్యతరగతి వారికి ఎంతో ఊరట లభిస్తుంది. అలా బాగానే ఉంది కదా? ఇందులో అవినీతి ఏముందీ? అని ఎవరికైనా అనుమానం వస్తుంది.

ఆయుష్మాన్ భారత్‌ను అడ్డుపెట్టుకుని, అధికారంలో ఉన్న బిజెపి ఏం చేసిందో కాగ్ వివరాలు ఇచ్చింది. అవి ఇలా ఉన్నాయి. 1.వేర్వేరు కారణాల వల్ల అంతకు ముందే చనిపోయిన వారికి ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున డబ్బు చెల్లించింది-అంటే, చెల్లించినట్టు రాసి పెట్టారు! అసలైతే ఆ డబ్బు ఏ దేశ నాయకుడి ఖాతాలోకి పోయిందో ప్రజలు సులభంగానే ఊహించుకోవచ్చు. 2. దేశ పౌరులు మొదట ఆ స్కీమ్‌లో తమ పేరు నమోదు చేసుకుంటారు కదా? అలా నమోదు చేసుకున్న విధానం చూస్తే మతిపోతుంది. ఎందుకంటే ఒకే ఒక్క మొబైల్ నెంబర్ నుండి లక్షల మంది పేర్లు రిజిస్టర్ అయి ఉన్నాయి. ఒక కుటుంబంలోని సభ్యులు ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకుంటే, ఇంట్లో ఉన్న ఒక మొబైల్ నెంబర్‌తో నలుగురో, అయిదుగురో రిజిస్టర్ చేసుకుంటారు-నిజమే! అంతవరకు మనం అర్థం చేసుకోవచ్చు. కానీ, ఒక్క మొబైల్ నెంబర్‌తో లక్షల మంది పేర్లు రిజిస్టర్ కావడం సాధ్యమా? పైగా అంతకు ముందెప్పుడో చనిపోయిన వారి ఎకౌంట్లలోకి డబ్బులు పంపినట్లు దొంగ లెక్కలు రాసుకున్నారు. అంటే వందల కోట్ల రూపాయల్లో ఎవరికీ ఏమి ఇచ్చింది లేదు. ఒక కాకమ్మ కథ తయారు చేసి దేశ నాయకులు డబ్బు లాగేశారన్నమాట. 3. దీనివల్ల ఆయుష్మాన్ భారత్ అంటే ఆయుష్మాన్ బిజెపి అయిపోయిందన్న మాట. 4. ఈ పథకం వల్ల దేశ ప్రజలకు ఏ మాత్రం లాభం చేకూరలేదన్న విషయం కాగ్ చెప్పకనే చెప్పింది. 5. ఏడున్నర లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారని చూపించిన ఒక మొబైల్ నెంబరు గురించి ఎంక్వయిరీ చేస్తే - బిఐయస్ డేటా విశ్లేషకులు చెప్పిన దాని ప్రకారం అసలు ఆ నెంబర్‌తో సిమ్ కార్డు లేదు. లక్షా ముప్పయి తొమ్మిది వేల మూడు మంది రిజిస్ట్రేషన్ 8888888888 (పది సార్లు 8) నెంబరుగల మొబైల్‌తో చేశారు. తొంబయి ఆరు వేల నాలుగు వందల అరవై మంది-అంటే సుమారు లక్ష మంది మొబైల్ నెంబరు 9000000000 (9-9 సున్నాలు)తో రిజిస్టరయ్యారు. ఇంకా 20 వేల మంది ఇలాంటి ఒక లేని, తప్పుడు మొబైల్‌తోను, మరో 15 వేల మంది మరో దొంగ మొబైల్ నెంబర్‌తోనూ అలా అలా లక్షల మంది రిజిస్టర్ అయ్యారు. వారివారి దొంగ ఖాతాల్లోకి డబ్బులు పంపినట్లు రికార్డులు సృష్టించుకున్నారు అని కాగ్ నిరూపించింది.

పొరపాటున విషయం బయటపడి విచారణ జరిగితే ఎలా? అన్న భయం లేకుండా, తెగించి రికార్డులు తయారు చేసుకున్నారు. ఇంకా కాగ్ చెప్పిన విషయమేమంటే-"లబ్ధిదారులు" చనిపోయిన తేదీ తర్వాత-కొంతకాలం తర్వాత.. ఎప్పుడో వారి ఎకౌంట్లో డబ్బులు వేసినట్టు రికార్డు సృష్టించారన్నమాట! ప్రభుత్వ శాఖలో ఉండే మరణాల లిస్టు బయటికి తీసి ఇలా ఆరోగ్య పథకానికి డబ్బులిచ్చామని చక్కగా కథ అల్లుకున్నారు. మూర్ఖుల తెలివితేటలు ఇదిగో ఇలా ఉంటాయి! అందుకే జర్మన్ నవలా రచయిత ఫ్రాంజ్ కాఫ్కా అన్నాడు "వారి మూర్ఖత్వం వల్లనే వారికి వారిపై అంతగా నమ్మకం ఉంటుంది!" అని! మూర్ఖుల గురించి చెప్పాడు. ఆనాడు యుపిఎ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టడానికి కాగ్ ఇచ్చిన రిపోర్టు మార్చి కాంగ్రెస్‌ను విమర్శించారు కదా? మరి పదేళ్లుగా దోషుల్ని జైలుకు ఎందుకు పంపలేదూ? -అని సామాన్యుడు ప్రశ్నిస్తాడు కదా? అంటే -అవినీతి ఆనాటి ప్రతిపక్ష బిజెపిదేనని తేలిపోయింది. ఇప్పుడు కూడా అధికార బిజెపిదే అవినీతి అని తేటతెల్లమయ్యింది. ఎందుకంటే ఈ వివరాలు తెచ్చి ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం లేదు. (న్యూట్రల్‌గా ఉండే మీడియా ఇచ్చిన ఆధారాలను బట్టే నేను విషయాలు తెలియజేస్తున్నాను) విపక్షాలు గెలిచిన చోట డబ్బులు వెదజల్లి అధికారం స్వంతం చేసుకోవడం అధికార బిజెపికి మామూలై పోయింది. ఒక రకంగా అదీ అవినీతే. అన్నన్ని డబ్బులు ఎలా వెదజల్లుతున్నారంటే ఇదిగో ఇలా ప్రజలకు తెలియకుండా ప్రజల సొమ్ము స్వాహా చేస్తున్నారన్నమాట! బ్యాంకులు దోపిడీ చేసి లక్షల కోట్లు కొల్లగొట్టుకుపోయిన గుజరాత్ దొంగల్ని దేశం దాటించడం తర్వాత రుణమాఫీ పేరుతో అవన్నీ మాఫీ చేయడం బిజెపి ప్రభుత్వపు అవినీతి కాదా? బిజెపి పార్టీ ఒక 'వాషింగ్ మిషన్' అని అందులో వేసి ఉతుక్కుంటే ఎంతటి వారైనా నీతిమంతులుగా, పని మంతులుగా తయారై వచ్చి దేశ భక్తులవుతారని ఆ పార్టీ చెప్పుకుంటుంది. అదే విధంగా ఇ.డి బెదిరింపులకు లొంగి బిజెపికి లొంగి అందులో చేరిపోయిన వారెందరూ? అజిత్ పవార్, ఎడియూరప్ప, జ్యోతిరాదిత్య సిధియా, సువేందు అధికారి, హిమంత బిశ్వ శర్మ, ముకుల్ రాయ్, ప్రఫుల్ పటేల్, శివరాజ్ సింగ్ చౌహాన్, రమేశ్ పోఖ్రియాల్...లాంటి వారు ఒకప్పుడు అవినీతిపరులు. బిజెపిలో చేరాక ఇప్పుడు నీతిపరులయ్యారు. ఇదంతా బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ - మోడీ ప్రభుత్వపు అవినీతి కాదా?

ఆయుష్మాన్ భారత్‌ను అడ్డుపెట్టుకుని, అధికారంలో ఉన్న బిజెపి ఏం చేసిందో కాగ్ వివరాలు ఇచ్చింది. అవి ఇలా ఉన్నాయి. 1.వేర్వేరు కారణాల వల్ల అంతకు ముందే చనిపోయిన వారికి ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున డబ్బు చెల్లించింది-అంటే, చెల్లించినట్టు రాసి పెట్టారు! అసలైతే ఆ డబ్బు ఏ దేశ నాయకుడి ఖాతాలోకి పోయిందో ప్రజలు సులభంగానే ఊహించుకోవచ్చు. 2. దేశ పౌరులు మొదట ఆ స్కీమ్‌లో తమ పేరు నమోదు చేసుకుంటారు కదా? అలా నమోదు చేసుకున్న విధానం చూస్తే మతిపోతుంది. ఎందుకంటే ఒకే ఒక్క మొబైల్ నెంబర్ నుండి లక్షల మంది పేర్లు రిజిస్టర్ అయి ఉన్నాయి. ఒక కుటుంబంలోని సభ్యులు ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకుంటే, ఇంట్లో ఉన్న ఒక మొబైల్ నెంబర్‌తో నలుగురో, అయిదుగురో రిజిస్టర్ చేసుకుంటారు-నిజమే! అంతవరకు మనం అర్థం చేసుకోవచ్చు. కానీ, ఒక్క మొబైల్ నెంబర్‌తో లక్షల మంది పేర్లు రిజిస్టర్ కావడం సాధ్యమా? పైగా అంతకు ముందెప్పుడో చనిపోయిన వారి ఎకౌంట్లలోకి డబ్బులు పంపినట్లు దొంగ లెక్కలు రాసుకున్నారు. అంటే వందల కోట్ల రూపాయల్లో ఎవరికీ ఏమి ఇచ్చింది లేదు. ఒక కాకమ్మ కథ తయారు చేసి దేశ నాయకులు డబ్బు లాగేశారన్నమాట. 3. దీనివల్ల ఆయుష్మాన్ భారత్ అంటే ఆయుష్మాన్ బిజెపి అయిపోయిందన్న మాట.

అర్హులైన వారికి ఇవ్వాల్సిన పెన్షన్ డబ్బును అక్రమంగా మళ్లించి - ప్రభుత్వ ప్రకటనలకు వాడుకున్నారని కాగ్ రిపోర్టు చేసింది. 2019 ఎన్నికలకు ముందు పెద్ద పెద్ద హోర్డింగ్‌లకు, పత్రికలు, టి.వి ప్రకటనలకు వాడుకుంది. వృద్ధులకు, వికలాంగులకు, రిటైరయిన ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వడం కన్నా-తమ ప్రభుత్వ ప్రకటనలే ముఖ్యమనుకుంది -బిజెపి కేంద్ర ప్రభుత్వం! మరో విషయమేమంటే 'బిజినెస్ లైన్' పత్రిక 31 జులై 2023న హర్యానా-ఫరీదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన ఒక స్కాంపై సవివరమైన వ్యాసం ప్రచురించింది. 2015-2020 మధ్యకాలంలో వేర్వేరు పనులకు సంబంధించిన చెల్లింపులు కేవలం ఒకే ఒక్క కాంట్రాక్టర్‌కు చెల్లించారు. నియమ నిబంధనలకు నీళ్లొదిలి, కళ్లు మూసుకుని అదే ఫరీదాబాద్‌కు చెందిన బిజెపి మద్దతుదారయిన సత్‌బీర్ సింగ్ అనే కాంట్రాక్టర్‌కు 5 వేల ఓచర్ల ద్వారా విడతల వారీగా రూ. వంద కోట్ల పైచిలుకు డబ్బు చెల్లించారు. అక్కడేమైనా అభివృద్ధి జరిగిందా అంటే అదీ లేదు. అంతా పేపర్ మీదే ఉంది. ఆ కాంట్రాక్టర్ ద్వారా డబ్బంతా బిజెపి అగ్ర నాయకులకు చేరిందని ప్రత్యేకంగా ఊహించనక్కర లేదు. మోడీ ప్రభుత్వంలో అవినీతి జరగలేదనీ, జరగడం లేదనీ కాదు - మీడియా ప్రజలకు చెప్పడం లేదు - అంతే!!

కోవిడ్ సమయంలో చూశాం. దేశ ప్రజలకు ఈ బిజెపి ప్రభుత్వం కల్పించిన రక్షణ ఏమీ లేదు. పైగా తమది నిజాయితీ గల ప్రభుత్వమని అగ్రనాయకులే ప్రచారం చేసుకుంటున్నారు. గ్యాసు, పెట్రోలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. టాక్సులు విపరీతంగా పెరిగాయి. 'హంగర్ ఇండెక్స్'లో దేశం అట్టడుగున ఉంది. మత కలహాలు చెలరేగే దేశాల జాబితాలో పై స్థానం ఆక్రమించింది. రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. రామాలయం పేరు మీద దాని చుట్టూ అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకుంటూ బిజెపి ప్రభుత్వం చేస్తున్న దోపిడీ ఒక్కొక్కటి బయటికి వస్తోంది. యువత అధికంగా ఉన్న దేశం మనది. అందుకే దేశ భవిష్యత్తు యువత నిర్ణయం మీదే ఆధార పడి ఉంది. 'జై శ్రీరామ్' నినాదం ఎవరికీ తిండి పెట్టదు. కూడు గుడ్డానివ్వదు. మోడీ ప్రభుత్వం పెంచి పోషిస్తున్న మూర్ఖత్వాన్ని బద్దలు కొట్టుకుని యువత బయటపడాలి! ఒకప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీని తన్ని తగలేసినట్టే ఇప్పుడు ఈ నార్త్ ఇండియా కంపెనీని కూడా వదిలించుకోవాలి. ప్రాథమిక హక్కుల్ని హరిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేస్తున్న అవినీతిమయ బిజెపి ప్రభుత్వం అవసరమా? ఈ దేశ పౌరులు తక్షణం ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

/ వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్ర వేత్త
- మెల్బోర్న్ నుంచి /

★

జనవాక్యం

ద్రవ్యోల్బణం తగ్గింపు ఇలాగా?

మన కేంద్ర ప్రభుత్వం ద్రవ్యోల్బణం పెరిగినప్పుడల్లా ధరల నియంత్రణ చర్యలు చేపట్టకుండా...బ్యాంకు, పోస్టాఫీసుల్లో సామాన్యులు దాచుకున్న డిపాజిట్లపై వడ్డీలను తగ్గిస్తున్నది. పెరిగిపోతున్న జీవన వ్యయంతో సతమతమవుతున్న వీరికి డిపాజిట్లపై తగ్గుతున్న ఆదాయం వల్ల మరొక నష్టం కలుగుతున్నది. అసలు ఈ ప్రభుత్వ సంస్థల్లో డబ్బు దాచుకునే వారిలో అత్యధిక శాతం ఎటువంటి ఆదాయం లేని, వ్యాపార వ్యవహారాలు తెలియని, స్థిరమైన ఆదాయం లేని సామాన్యులు, నిజాయితీగా చేసి ప్రభుత్వ సంస్థల్లో రిటైరైన, ఇంకా చేయాల్సిన సర్వీసు ఎంతో వున్నా వడ్డీతో ప్రశాంతంగా జీవనం సాగించవచ్చని స్వచ్ఛంద ఉద్యోగ విరమణలు చేసిన పెన్షన్ సౌకర్యం లేని లక్షలాది మంది వున్నారు. కనీస ఖర్చులకు సైతం ఇబ్బందిపడే వారు కూడా వున్నారు. వారికి ఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవు, ఆశించరు. ఆరోగ్యశ్రీ వంటి పథకాలు వున్నా, ఆనారోగ్యాల పాలైతే వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందుల వంటి సొంత ఖర్చులు భారీగానే వుంటాయి. ఇక ద్రవ్యోల్బణంతో వీరు దాచుకున్న మూలధనం విలువ నానాటికి తగ్గిపోతూ తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వ పెద్దలు గ్రహించాలి. అసలు బడా కార్పొరేట్ పెద్దలు బ్యాంకులకు చెల్లించాల్సిన లక్షల కోట్ల రూపాయలను కేంద్రం ఉదారంగా మాఫీ చేస్తుంటే బ్యాంకుల లాభాలు తగ్గిపోతున్నాయిగాని, వడ్డీరేట్లు పెంపుతో కాదు. కనుక ఇకనైనా మన కేంద్ర ఆర్థిక మంత్రి గారు ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. పొదుపు చేసుకునే వారి డిపాజిట్లపై వడ్డీరేట్లను సహేతుకంగా పెంచాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు,
నరసరావుపేట

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు...


వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాలు, సమస్యలను చర్చించడానికి ప్రతి ఏటా మార్చి 15న 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం' పాటిస్తున్నాం. వినియోగదారులు లేకుండా వ్యాపారాలు లేవు. వ్యాపార వస్తుసేవలకు వినియోగదారుడే కేంద్ర బిందువు. వినియోగదారులు సంతృప్తి చెందితేనే వ్యాపారాలు వర్థిల్లుతాయి. అన్యాయానికి, వస్తు సేవల లోపానికి గురైనపుడు న్యాయం కోసం వినియోగదారుల కోర్టులు/ఫోరమ్‌లను ఆశ్రయించి తగు పరిహారం పొంది, అక్రమ వ్యాపారులకు/వస్తుసేవల లోపాలకు/ఉత్పత్తిదారులకు శిక్షలు కూడా పడేలా చేసే వెసులుబాటు చట్టం ద్వారా కల్పించబడింది. వినియోగదారుల ఫోరమ్‌లు జిల్లా వివాద పరిష్కార ఫోరమ్‌లు, రాష్ట్ర వివాద పరిష్కార ఫోరమ్‌లు, జాతీయ వివాద పరిష్కార ఫోరమ్‌లు అందుబాటులో ఉన్నాయి. వస్తు/సేవల విలువ రూ. 20 లక్షల లోపు ఉన్నప్పుడు జిల్లా వినియోగదారుల కోర్టులకు, రూ. 20 లక్షల నుంచి రూ.కోటి విలువ వరకు రాష్ట్ర కోర్టులు, ఒక కోటి కన్న ఎక్కువ ఉన్నపుడు జాతీయ వినియోగదారుల కమీషన్లను ఆశ్రయించాల్సి ఉంటుంది. అక్రమ వ్యాపారులను కట్టడి చేస్తూ, వినియోగదారులకు సత్వర పరిహారాలు అందించే నెలవులుగా వినియోగదారుల ఫోరమ్‌లు సర్వదా కషి చేస్తున్నాయి. అన్యాయానికి గురైన సామాన్య వినియోగదారులు నేటికీ ఫోరమ్‌లను ఆశ్రయించడం లేదు. వినియోగదారుల విద్యను ప్రజలకు చేరువ చేస్తూ, వినియోగదారుల హక్కుల అవగాహన, చైతన్యపరిచే కార్యక్రమాలను బాధ్యతగల పౌరులు ఉద్యమంలా చేపట్టాలి. వ్యాపార వస్తుసేవలకు పునాది వినియోగదారుడే. వినియోగదారుడు సదా న్యాయమైన సేవలను పొందినపుడే వస్తు వ్యాపారాలు వర్థిల్లుతాయి.

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్ :9949700037

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

వ్యాఖ్య

బైడెనోమిక్స్ బండారం!



జో బైడెన్ ఎన్నికైనపుడు అమెరికా "దౌర్భాగ్యం లేదా దుర్దశ లేదా యాతన రెండవ సూచిక 17.65 శాతం"గా ఉంది. ఇప్పుడు రెండోసారి ఓట్లడుగుతున్నపుడు 23 శాతం ఉందని, జనం పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయానికి 24 శాతానికి పెరగవచ్చని బ్లూమ్‌బెర్గ్ ఎకనమిక్స్ తాజాగా ప్రకటించింది. దీని అర్థం ఏమిటంటే సగటు అమెరికన్ పౌరుడి జేబులు ఖాళీ అవుతున్నాయి. నిజ వేతనాలు పెరగటం లేదు, ద్రవ్యోల్బణం కారణంగా కొనుగోలు శక్తి తగ్గిపోతున్నది. బైడెన్ కంటే ముందు నాలుగు సంవత్సరాల్లో నిజ వేతనాలు 2.8 శాతం పెరిగితే మూడేళ్ల బైడెన్ ఏలుబడిలో పెరిగింది కేవలం 0.76 శాతమే. అంటే పరిస్థితి దిగజారిందని దౌర్భాగ్య సూచిక నిర్ధారించినట్లే కదా!

విఫల రాజకీయ నేతలు ప్రపంచమంతటా అనుసరించే పద్ధతి ఒక్కటే. ఒకరిని చూసి ఒకరు నినాదాలను కాపీ కొడుతుంటారు. గతంలో అమెరికాలో రోనాల్డ్ రీగన్ అనుసరించిన విధానాలకు రీగనోమిక్స్ అని పేరు పెట్టారు. ఇప్పుడు బైడెనోమిక్స్ అంటున్నారు. మన దేశంలో మోడినోమిక్స్ గురించి తెలిసిందే. ఎవరు ఏ పేరు పెట్టుకున్నా పూసల్లో దారంలా కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలే తప్ప మరొకటి కాదు. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయంటూ చెప్పిన చోట చూస్తే చిన్న నీటి కుంట కూడా కనిపించదు. గతంలో దేశం వెలిగిపోతోందని వాజ్‌పేయి చెబితే ఇప్పుడు వికసిత భారత్ అంటూ నరేంద్ర మోడీ ఊరూరా తిరుగుతున్నారు. అమెరికాలో ఈ ఏడాది నవంబరులో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే డెమోక్రటిక్ పార్టీ తరపున జో బైడెన్, రిపబ్లికన్ల అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్ ఖరారైనట్లు వార్తలు. ఇద్దరూ రెండోసారి గెలిచేందుకు పోటీ పడుతున్నారు. ట్రంప్ అమెరికాకే అగ్రతాంబూలం అంటుంటే మరోసారి అమెరికాలో సూర్యోదయం అని జోబైడెన్ ఓటర్లను ఆకట్టుకునేందుకు చూస్తున్నారు. పది సంవత్సరాల తరువాత నరేంద్రమోడీ గ్యారంటీలంటూ టీవీలు, ఇతర మాధ్యమాల్లో ఊదరగొడుతున్నారు. బైడెన్ కోసం రూపొందించిన ఒక నిమిషపు ప్రచార ప్రకటన "అమెరికాలో మరోసారి సూర్యోదయం, దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా నేడు పురుషులు, మహిళలు పనులకు వెళుతున్నారు. ఒక చిన్న పట్టణంలో ఐదున్నర వేల మంది వివాహం చేసుకోబోతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ద్రవ్యోల్బణం ఇప్పుడు సగమే ఉంది, ప్రగాఢ విశ్వాసంతో భవిష్యత్‌ను మనం చూడవచ్చు" అని దానిలో ఊదరగొట్టారు. అది నిజమా?

జో బైడెన్ ఎన్నికైనపుడు అమెరికా "దౌర్భాగ్యం లేదా దుర్దశ లేదా యాతన రెండవ సూచిక 17.65 శాతం"గా ఉంది. ఇప్పుడు రెండోసారి ఓట్లడుగుతున్నపుడు 23 శాతం ఉందని, జనం పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయానికి 24 శాతానికి పెరగవచ్చని బ్లూమ్‌బెర్గ్ ఎకనమిక్స్ తాజాగా ప్రకటించింది. దీని అర్థం ఏమిటంటే సగటు అమెరికన్ పౌరుడి జేబులు ఖాళీ అవుతున్నాయి. నిజ వేతనాలు పెరగటం లేదు, ద్రవ్యోల్బణం కారణంగా కొనుగోలు శక్తి తగ్గిపోతున్నది. బైడెన్ కంటే ముందు నాలుగు సంవత్సరాల్లో నిజ వేతనాలు 2.8 శాతం పెరిగితే మూడేళ్ల బైడెన్ ఏలుబడిలో పెరిగింది కేవలం 0.76 శాతమే. అంటే పరిస్థితి దిగజారిందని దౌర్భాగ్య సూచిక నిర్ధారించినట్లే కదా! ఇలాంటి స్థితిలో ఓటర్లు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది. బహుశా ఈ వైఫల్యాన్ని పసిగట్టే మన నరేంద్ర మోడీ గారి జిగినీ దోస్తు డోనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారానికి వస్తాననే ధీమాను వెల్లడిస్తున్నాడేమో. ప్రపంచంలో అత్యంత పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ కలిగినదిగా, ఇటీవలి దశాబ్దాలలో అత్యంత బలీయమైనదిగా బైడెన్ ప్రచారం చేసుకుంటున్న అమెరికాలో అంతా బాగుంటే జనాల పరిస్థితి ఎందుకు దిగజారుతున్నట్లు? నిజవేతనాలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరగకపోవటం, 2022లో మధ్యతరగతి ఆదాయ కుటుంబాలపై 20 నుంచి 30 శాతం పన్నులు పెంచటం, కార్పొరేట్ల మీద పెంచిన పన్నుల్లో 70శాతం భారాన్ని కార్మికులే భరించాల్సి వచ్చిందని టాక్స్ పాలసీ సెంటర్, టాక్స్ ఫౌండేషన్ సంస్థల అధ్యయనంలో తేలింది.

సర్వరోగ నివారిణి జిందా తిలిస్మాత్ అన్నట్లుగా జన జీవితాలు దుర్భరం కావటానికి ద్రవ్యోల్బణమే కారణమని ప్రభుత్వం, దాని సమర్థకులు నమ్మించేందుకు చూస్తారు. సాధారణ జన పరిస్థితి దిగజారుతున్నది తప్ప కార్పొరేట్లకు ఎలాంటి ఇబ్బంది లేదు. అంటే ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, నిజ వేతనాల స్థంభన తప్ప మరొకటి కాదు. బైడెనోమిక్స్, ట్రంప్‌నోమిక్స్ పేరు ఏదైనా అమెరికా పౌరుల పరిస్థితి దిగజారుతున్నది. శ్రామిక శక్తి భాగస్వామ్యం, ఉపాధి 2019 స్థాయి కంటే తక్కువగా ఉంది. ఏటా రెండులక్షల కోట్ల డాలర్ల ప్రభుత్వ లోటు, 34లక్షల కోట్ల డాలర్ల అప్పు ఉంది. 2021-23 మధ్య వినిమయ ధరల ద్రవ్యోల్బణం 17.6 శాతం కాగా ఆహార 33.7, గృహ వసతి 18.8, ఇంధనం 32.8, ఒకసారి కొన్న తరువాత తిరిగి వెనక్కు తీసుకోని వస్తువుల ద్రవ్యోల్బణం 30 శాతం ఉన్న తరువాత నిజవేతనాల్లో సగటున 0.7 శాతం పెరిగితే జనాలు విషాదంతో నవ్వుకోవటం తప్ప మరొకటి కాదు. ఈ వైఫల్యాలకు తోడు అంతర్జాతీయంగా ఉక్రెయిన్ సంక్షోభం, గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతల పట్ల అనుసరిస్తున్న వైఖరి మీద జనాల్లో వ్యతిరేకత పెరుగుతోంది. అందుకే వారి ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు ఇజ్రాయిల్ మీద విమర్శలు చేసినా, రష్యాను వెనక్కు కొడతామని ప్రగల్భాలు పలుకుతున్నా ప్రయోజనం కనిపించటం లేదు. అందుకే ఎన్నికల ముందు జో బైడెన్ ఇంటా బయటా తీవ్ర వ్యతిరేకత, విమర్శలను ఎదుర్కొంటున్నారు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ప్రజాశక్తి
www.prajasakti.com

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.
నమోదిత కార్యాలయం: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవ్‌రంగ్‌పుర, అహ్మదాబాద్-09.
శాఖ కార్యాలయం: #76-8-10/1, ఫ్లాట్ నెం.4, భవానీ టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక, భవానీపురం, విజయవాడ-520012.

అనుబంధం IV- స్వాధీనత నోటీసు
రూల్ 8(1) చూచుట (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారుడు అయిన మెసర్స్. హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, సెక్యురిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యురిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 మరియు 9 తో చదువుతూ సెక్షన్ 13(12) (3) క్రింద 20-12-2023 తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. లోను ఎ/సి నంలు.12294985-4861564 లోని పిలువబడిన దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారులు, 1. శ్రీ.ఉమా రాజేశ్వరి టూర్స్ అండ్ ట్రావెల్స్, గాయత్రి కాంప్లెక్స్, షాప్ నం.15, ఫైర్ స్టేషన్ ఎదురు, గ్లోబల్ హాస్పిటల్ భవనం, విజయవాడ-520002, ఆంధ్రప్రదేశ్. 2. నున్న వెంకటఅనసూయా దేవి, 12-2017, విజయవాడ క్లబ్ రోడ్డు వద్ద, సుందరయ్య నగర్, తాడేపల్లి, విజయవాడ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522001. 3. నున్న పాండురంగారావు, శ్రీ.ఉమా రాజేశ్వరి టూర్స్ అండ్ ట్రావెల్స్, గాయత్రి కాంప్లెక్స్, షాప్ నం.15, ఫైర్ స్టేషన్ ఎదురు, గ్లోబల్ హాస్పిటల్ భవనం, వార్డు-21, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-5200024. 4. నున్న పాండురంగారావు, డో.నం.12-2017, సుందరయ్య నగర్, తాడేపల్లి, గుంటూరు-522501, ఆంధ్రప్రదేశ్, నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి రూ॥32,45,849/- (ముప్పై రెండు లక్షల నలభై ఐదు వేల ఎనిమిది వందల నలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) 14-12-2023 నాటికి ...

... విక్రయించబడిన ఆస్తి 46 అ.లు., దక్షిణం : కె.వెంకటరమణ కుమారికి చెందిన ఆస్తి 46 అ.లు., తూర్పు : మున్సిపల్ రోడ్డు 25 అ.లు., పడమర : భాగవతరావుకు చెందిన ఆస్తి 25 అ.లు.

తేది: 12.03.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : గుంటూరు హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎడ్లపాడు బ్రాంచి (19221)
డోర్ నెం.4-53/1, ఆంధ్రాబ్యాంక్ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డు, ఎడ్లపాడు-522233. ఫోన్: 08647-276108

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు / సహపూచీదారులు / తనఖాదారులు / హామీదారులుకు నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ పేర్కొనబడిన **ఋణగ్రహీతలు / సహపూచీదారులు / తనఖాదారులు / హామీదారులు** నుండి సెక్యూరిటీ క్రెడిటార్ అనగా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** కు రావలసిన దిగువ పేర్కొనబడిన మొత్తమును రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎడ్లపాడు బ్రాంచి** యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన / ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ ఏమి ఉన్నది" ...

రిజర్వుధర: రూ.12,06,000/- బయానా: రూ.1,21,000/- బిడ్ పెంపుదల: రూ.12,100/-

www.mstcecommerce.com

... www.unionbankofindia.co.in / https://www.ibapi.in ...

రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకపు ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది. పైన తెలిపిన ఋణంకు సంబంధించి పైన పేర్కొన్న తేదీలో ఇ-వేలం విక్రయం నిర్వహించబడునని ఋణగ్రహీతలు / హామీదారులకు తెలియజేయడమైనది.

తేది : 07-03-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఎడ్లపాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ, చిరునామా : 4వ ఫ్లోర్, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8 (1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్, 2002 ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత/ డైరెక్టర్స్ / ప్రమోటర్స్: 1 (ఎ) మెస్సర్స్ ఇంటిగ్రల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్,** డి.నెం.54-20/6-17ఎ, గ్రౌండ్ ఫ్లోర్, ఇంటి నెం.35, 2వ లేన్, కనక దుర్గ గెజిటెడ్ కాలనీ, విజయవాడ - 520008. **1(బి) శ్రీ పి. శ్రీధర్ రావు (మేనేజింగ్ డైరెక్టర్),** డి.నెం.54-20/6-17ఎ, గ్రౌండ్ ఫ్లోర్, ఇంటి నెం.35, 2వ లేన్, కనక దుర్గ గెజిటెడ్ ఆఫీస్ కాలనీ, విజయవాడ - 520008. **1(సి) శ్రీ పి. శేషగిరి రావు** ...

తేది : 12-03-2024 సం/- అధీకృత అధికారి
స్థలం : విజయవాడ అస్సెట్ రికవరీ బ్రాంచ్, విజయవాడ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కొంత మంది బానిసత్వంతో మరికొంత మందికి పరిశుభ్రత సాధించలేం

- బాంబే హైకోర్టు

ముంబయి : పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించిన ఒక కేసులో బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంక్షేమ రాజ్యంలో కొంత మందిని బానిసత్వంలో నిమగ్నం చేయడం ద్వారా మరికొంత మందికి పరిశుభ్రత సాధించలేమని పేర్కొంది. 580 మంది మున్సిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, వారికి అన్ని ప్రయోజనాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ముంబయి మున్సిపల్ విభాగంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తోన్న 580 మంది తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని కోరుతూ అక్కడి వర్కర్స్ యూనియన్ కోర్టును ఆశ్రయించాయి. రోడ్లను ఊడ్చటం, చెత్త సేకరణ వంటి పనులు నిర్వర్తించే వీరికి శాశ్వత పోస్టులు సృష్టించాలంటూ ఇండస్ట్రియల్ ట్రెబ్యునల్ గతంలో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ గ్రేటర్ ముంబయి హైకోర్టులో సవాలు చేసింది. ఈ పిటీషన్‌ను విచారిస్తూ జస్టిస్ మిలింద్ జాధవ్ ఏకసభ్య ధర్మాసనంపై వ్యాఖ్యలు చేసింది. 'స్వచ్ఛమైన వాతావరణనేది పౌరుల ప్రాథమిక హక్కు. కానీ కార్మికుల మానవ గౌరవాన్ని కాలరాయడం ద్వారా దాన్ని సాధించలేం' అని పేర్కొంటూ తీర్పు చెప్పింది. ట్రెబ్యునల్ ఇచ్చిన తీర్పును కొట్టివేయడమనేది 'న్యాయాన్ని అపహాస్యం' చేసినట్లే అవుతుందని కూడా స్పష్టం చేసింది. దీంతో నవంబర్ 2023లో ఇచ్చిన తీర్పు తాజాగా అందుబాటులోకి వచ్చింది.

2018 గ్రూప్-1 వారికి ఎన్నికల విధులు వద్దు

- ఎన్నికల ప్రధాన అధికారికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు తీర్పు నేపథ్యంలో 2018 గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారికి ఎన్నికల విధుల నుంచి తప్పించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు గురువారం లేఖ రాశారు. గ్రూప్-1 నోటిఫికేషన్‌పై హైకోర్టు ఆదేశాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కొంతమంది ఆర్‌డివోలుగా ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం వారు విధుల్లో కొనసాగించడానికి వీలు లేదని తెలిపారు. చిత్తూరు జిల్లా టిడిపి నేత పులవర్తి నాని సతీమణిపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మరో లేఖ రాశారు. ఎన్నికల అవకతవకలపై అందిన 49ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మరో లేఖ రాశారు.

ప్రజలను ప్రలోభ పెడుతున్న జగన్: షరీఫ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఓటమి భయంతో ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు ఎంఎ షరీఫ్ విమర్శించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన గ్రామ, వార్డు వాలంటీర్లు వైసిపి కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాధనాన్ని గౌరవ వేతనంగా ఇస్తే వాలంటీర్లను వైసిపి కార్యకర్తల్లా వాడుకుంటారా అని ప్రశ్నించారు. వైసిపికి ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలను నిలిపివేస్తామని వాలంటీర్ల ద్వారా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. అనపర్తి వైసిపి ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి మహిళలకు పంచాలని వాలంటీర్లను బెదిరిస్తున్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి లేఖ రాశారు. తిరుపతి, ఆత్మకూరు నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వాలంటీర్లు ఓటర్లను తీసుకెళ్లి ఓటేయిస్తున్నారని టిడిపి నేత కొనేరు సురేష్ తెలిపారు.

వైసిపినే గీతాంజలిని హత్య చేసింది

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త గీతాంజలిని వైసిపినే హత్య చేసిందని తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. ఆడపిల్ల చావును కూడా శవ రాజకీయాలకు వాడుకుంటున్నారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెనాలి రైల్వే స్టేషన్‌లో ఆమెతో పాటు ఉన్న ఆ ఇద్దరి పేర్లు ఎందుకు బయట పెట్టడం లేదు? సిసి పుటేజ్ ఎక్కడ? అని ప్రశ్నించారు. గ్రూప్-1 ఉద్యోగాలను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని రూ.150కోట్ల అవినీతికి వైఎస్ జగన్ పాల్పడ్డారని టిడిపి నేత కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు.

పళనిస్వామి, అన్నామలైపై స్టాలిన్ పరువునష్టం కేసు

చెన్నై: అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై ముఖ్యమంత్రి, డిఎంకె నాయకులు ఎంకె స్టాలిన్ పరువునష్టం దావా వేశారు. తమిళనాడులో ఇటీవల భారీ మాదక ద్రవ్యాల రాకెట్ బయటపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై అన్నాడిఎంకె, బిజెపి నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ కేసులో స్టాలిన్‌కు సంబంధాలున్నాయంటూ ఆరోపిస్తున్నారు. దీంతో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజకీయ శత్రుత్వంతో, ముఖ్యమంత్రి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆరోపణలు, వ్యాఖ్యలు చేశారంటూ ఆ దావాలో పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీ పోలీసులు, ఎన్‌సిబి సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ ద్వారా మాదక ద్రవ్యాల నెట్‌వర్క్ బయటపడింది.

జాతీయస్థాయికి 'కోనసీమ' విద్యార్థి ప్రాజెక్ట్ ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు విద్యార్థి రూపొందించిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైంది. చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ ఉన్నత పాఠశాల విద్యార్థి నక్కా సత్య ప్రవీణ్ (8వ తరగతి) తయారుచేసిన ప్లాంట్స్ గ్రోయింగ్ మిషన్ జాతీయ స్థాయికి ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఆర్.కామేశ్వర రావు గురువారం తెలిపారు. గైడ్ టీచర్‌గా మామిడిశెట్టి వేంకటేశ్వర రావు వ్యవహరియించినట్లు తెలిపారు. విద్యార్థి ప్రవీణ్‌ను మునిసిపల్ ఛైర్ పర్సన్ కమిషనర్ తదితరులు అభినందించారు.

రూ.73.43 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు

- మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 మరియు 9 తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (ది "యాక్ట్") క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ వేలం విక్రయ నోటీసు. దిగువ వివరించిన స్థిరాస్తులు గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడిన పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 17 నవంబర్, 2023 నుండి **గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా** మార్చబడింది) (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది మరియు వాస్తవంలో జి ఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీ తో విలీనం చేయబడింది) (ఇకపై యాక్ట్ ప్రకారం "సెక్యూర్ క్రెడిటార్" గా సూచించబడుతుంది) కి తనఖా పెట్టబడ్డాయని రుణగ్రహీత/సహ రుణగ్రహీత/తనఖాదారు(లు)/హామీదారు(లు) మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయడమైనది. యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు ప్రకారం సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ యొక్క రూల్ 8 మరియు 9 తో చదువుతూ యాక్ట్ యొక్క 13(12) క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ అధీకృత అధికారి ద్వారా స్వాధీనం చేసుకోవడమైనది. సెక్యూర్డ్ అసెట్స్‌ను 30/03/2024న **"ఎక్కడ ఉందో అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏమైనా ఉంది"** ప్రాతిపదికన ఇ వేలం ద్వారా విక్రయించబడుతుంది. అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నియమాల కొరకు ఇ-వేలం ప్లాట్‌ఫారం అందించిన వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** వద్ద సంప్రదించగలరని సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయడమైనది. దయచేసి జిహెచ్ఎఫ్ఎల్‌లు/సెక్యూర్డ్ క్రెడిటార్స్ అందించిన లింక్ వెబ్‌సైట్ అనగా.. **www.grihumhousing.com** లో చూడగలరు.

క్ర.సం.	ప్రతిపాదన నం. ఖాతాదారు పేరు (ఎ)	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయి మొత్తం (బి)	స్వాధీనత స్వభావం (సి)	ఆస్తి వివరణ (డి)	రిజర్వు ధర (ఇ)	ఇఎమ్‌డి (ఆర్‌పి 10 శాతం) (ఎఫ్)	ఇఎమ్‌డి సమర్పణ తేది (జి)	బిడ్ పెంపుదల (హెచ్)	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం (ఐ)	వేలం తేది మరియు సమయం (జె)	తెలిసిన భారాలు/ ఏవైనా కోర్టు కేసులు (కె)
1	లోన్ నం.: HM/0053/H/17/100408 స్వామి ధూళిపూడి (రుణగ్రహీత), ధూళిపూడి మల్లీశ్వరి (సహ రుణగ్రహీత)	నోటీసు తేది : 22/01/2022, రూ.36,17,092.00/- (ముప్పై ఆరు లక్షల పదిహేడు వేల తొంభై రెండు రూపాయలు మాత్రమే) 22-జనవరి-2022 నాటికి చెల్లింపుతో పాటు రియలైజేషన్ వరకు @ 13.00 శాతం వడ్డీ.	భౌతికం	ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ యొక్క అధికార పరిధిలోని కంకిపాడు మండలం, కంకిపాడు గ్రామ పంచాయతీ యొక్క ఆర్.ఎస్.నం.170/ 1, 170/2 లో ఉన్న (ట్యాక్స్ రసీదు నోటీసు ప్రకారం డో.నం.7/145, మూల్యాంకనం నం.1345) బేరింగ్ డో.నం.7-71/1 తనఖా ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ సైట్ విస్తీర్ణం 272.33 చ.గ.లు. లేదా 227.9 చ.మీ.లు.	రూ. 42,00,000/- (నలభై రెండు లక్షల రూపాయలు మాత్రమే)	రూ. 4,20,000/- (నాలుగు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే)	28/03/2024 Before 5 PM	10,000/-	22/03/2024 (11AM - 4PM)	30/03/2024 (11 AM- 2PM)	NIL

ఉద్దేశించిన బిడ్డర్లు/కొనుగోలుదారులు సెక్యూర్డ్ క్రెడిటార్ శాఖ మరియు వేలం ప్రాపర్టీలను సందర్శించి, తన స్వంత విచారణ చేసి, అదనపు ఛార్జీలు, భారాలు మరియు ఏవైనా థర్డ్ పార్టీ ఆసక్తులను నిర్ధారించుకోవాలని మరియు బిడ్‌లను సమర్పించే ముందు అన్ని అంశాలలో తనను తాను/ఆమెను/తానే సంతృప్తి చెందాలని సూచించారు. ఆస్తి పన్నులు, విద్యుత్/నీటి బకాయిలు మరియు ఏవైనా ఇతర బకాయిలు వంటి అన్ని చట్టబద్ధమైన బకాయిలు, ఏదైనా ఉంటే విజయవంతమైన బిడ్డర్ నిర్ధారించి చెల్లించాల్సిన ఆస్తికి జతచేయబడుతుంది. ఆసక్తిగల బిడ్డర్లు తమను తాము పోర్టల్‌తో నమోదు చేసుకోవాలి మరియు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ముందుగానే పొందవలసి ఉంటుంది, ఇది వేలం సర్వీస్ ప్రొవైడర్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చిరునామా : ప్లాట్ నం.68, 3వ అంతస్తు, గోర్గావ్, హర్యాణ-122003 నుండి ఇ-బిడ్డింగ్‌కు తప్పనిసరి. హెల్ప్ లైన్ నం.:7291981124,25,26 సపోర్ట్ ఇ మెయిల్ ఐడి : **Support@bankeauctions.com** సంప్రదించాల్సిన వ్యక్తి : వినోద్ చౌహాన్, ఇ మెయిల్ ఐడి : **delhi@c1india.com** సంప్రదించాల్సిన నం.: 9813887931 కాబోయే బిడ్డర్లు వారి నుండి మాత్రమే ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణను పొందవచ్చని దయచేసి గమనించండి. ఉద్దేశించిన కొనుగోలుదారు/బిడ్‌దారు "పూనావల్ల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్", బ్యాంక్-ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ ఖాతాలో ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా బయానా (ఇఎమ్‌డి) మొత్తాన్ని సమర్పించాలి. ఖాతా సంఖ్య-000651000460 మరియు ఐఎఫ్ఎస్‌సి కోడ్- ICIC0000006, 20, ఆర్.ఎన్. ముఖర్జీ రోడ్- కోల్‌కతా-700001 ఏదైనా జాతీయం చేయబడిన లేదా షెడ్యూల్ చేయబడిన బ్యాంకులో 28/03/2024న లేదా అంతకు ముందు డ్రా చేయబడింది మరియు **https://www.bankeauctions.com** వద్ద తమ పేరు నమోదు చేయించుకోవాలి మరియు యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు సర్వీస్ సర్వీస్ ప్రొవైడర్ నుండి ఇ వేలం శిక్షణ పొందండి. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న తర్వాత, కొనుగోలుదారు/బిడ్‌దారు కింది పత్రాల కాపీలను అప్‌లోడ్ చేసి, ఇ మెయిల్ పంపి స్వీయ-ధృవీకరించిన హార్డ్ కాపీని పొందవలసి ఉంటుంది చిరునామా- 2వ అంతస్తు, ప్లాట్ నెం.16, డో.నం.40-6 /2-16 ఎదురు, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మొగల్రాజపురం, విజయవాడ, మొబైల్ నెం. +91 9567626050 ఇ-మెయిల్ **rahul.r1 @grihumhousing.com** తదుపరి వివరాలు షరతులు మరియు నిబంధనల కొరకు దయచేసి **https://www.bankeauctions.com & www.grihumhousing.com** ఇ వేలంలో భాగం అయ్యేందుకు సందర్శించండి సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(6) క్రింద రుణగ్రహీత/సహ రుణగ్రహీత/తనఖాదారు(లు)/హామీదారు(లు)కు 15 రోజుల నోటీసుగా కూడా పరిగణించాలి.

తేది : 15.03.2024 ప్రదేశం : కృష్ణాజిల్లా — సం/- అధీకృత అధికారి, గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడింది)



మమతా బెనర్జీకి గాయం

కోల్‌కత్తా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి నాయకులు మమతా బెనర్జీకి తీవ్ర గాయమైంది. మమత తలకు తగిలిన గాయానికి సంబంధించిన ఫొటోలను టిఎంసి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. మమత కోలుకోవాలంటూ ప్రార్థించాలని విజ్ఞప్తి చేసింది. మమత ప్రస్తుతం కోల్‌కత్తాలోని ప్రభుత్వ ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అయితే గాయానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ముఖ్యమంత్రి వీలైనంత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు వివిధ పార్టీల నాయకులు తెలిపారు. కాగా, జనవరిలోనూ ఒక కారు ప్రమాదంలో మమతా తలకు స్వల్ప గాయమైంది. అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం బర్ధమాన్ నుంచి కోల్‌కత్తాకు తిరిగి వస్తుండగా.. ఆమె కాన్వాయ్‌కు ఎదురుగా ఉన్నట్టుండి మరో వాహనం రావడంతో దాన్ని తప్పించేందుకు డ్రైవర్ కారుకు బ్రేక్‌లు వేశాడు. దీంతో ముందు సీట్లో కూర్చున్న మమతా బెనర్జీ విండ్‌షీల్డ్‌కు ఢీకొనడంతో తలకు స్వల్ప గాయమైనట్టు అధికారులు వెల్లడించారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ మమత కాలికి గాయమయింది. కాలికి కట్టుకునే ఆమె ప్రచారంలో పాల్గొన్నారు.

విభజన అనేది సంఘ్ పరివార్ డిఎన్ఎలోనే వుంది

- బృందా కరత్

న్యూఢిల్లీ : "విభజన అనేది సంఘ పరివార్ డిఎన్ఎలోనే వుంది. ఎన్ఆర్‌సి (జాతీయ పౌర పట్టిక), సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం)లు రెండూ భిన్నమైనవని, సిఎఎతో ఎన్ఆర్‌సికి ఎలాంటి సంబంధం లేదంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అర్ధ రహితం". "సంఘ్ పరివార్ డిఎన్ఎలోనే ఈ విభజన వుంది. విభజన లేకుండా వారు మనుగడ సాగించలేరు. మతం పేరుతో ప్రజలను చీల్చడం, విద్వేషాలను వ్యాప్తి చేయడమే వారి జీవిత లక్ష్యం. భారత ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించడమే వారి జీవిత పరమావధి. సిఎఎను ఆమోదించిన ఐదేళ్ళ తర్వాత ఈ నిబంధనలను ఇప్పుడు తీసుకురావడంలోనే వారి దుర్బుద్ధి అర్ధమవుతోంది. లోక్‌సభ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో వున్నాయనగా ఈ నిబంధనలను ఎందుకు తీసుకువచ్చారు?" అని ఆమె ప్రశ్నించారు.

18 ఒటిటిల తొలగింపు

- 19 వెబ్‌సైట్లు కూడా

న్యూఢిల్లీ : అశ్లీల కంటెంట్, నకిలీ వార్తలను ప్రసారం చేస్తున్న ఆన్‌లైన్ వేదికలపై కేంద్రం కొరడా ఝుళిపించింది. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వాటి ప్రసారాల్లో మార్పు రాకపోవడంతో 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, 19 వెబ్‌సైట్‌లు, 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలను కేంద్రం తొలగించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. తొలగించిన యాప్‌లో ఏడు గూగుల్ ప్లేస్టోర్‌లోవి కాగా, మూడు యాపిల్ యాప్‌స్టోర్‌లోనివి. సోషల్ మీడియా ఖాతాల్లో ఫేస్‌బుక్‌లో 12, ఇన్‌స్టాగ్రామ్‌లో 17, ఎక్స్‌లో 16, యూట్యూబ్‌లో 12 ఉన్నట్లు తెలిపింది. రెండు రోజుల క్రితమే కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ దేశీయంగా ఉన్న 18 ఓటీటీ వేదికలు అసభ్యకర కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నాయని, వాటిపై చర్యలు ఉంటాయని ప్రకటించారు. ఇవి సోషల్ మీడియా ద్వారా అశ్లీల కంటెంట్‌కు సంబంధించిన ట్రైలర్, దృశ్యాలు, వెబ్‌లింక్‌లను ప్రచారం చేస్తున్నాయని వెల్లడించారు. అలాగే దేశంలో ఓటీటీ పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. ఇందులో భాగంగానే వెబ్‌సిరీస్‌లకు ఓటీటీ అవార్డులను ప్రవేశపెట్టామన్నారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వాటిపై తప్పక చర్యలుంటాయని ప్రకటలో పేర్కొన్నారు.

మానవాభివృద్ధి సూచిలో భారత్‌కు 134వ ర్యాంక్

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి సూచిలో భారత్ 134వ స్థానంలో నిలిచింది. 2022 ఏడాదికి గాను గురువారం పలు దేశాల ర్యాంకులను ఐరాసా విడుదల చేసింది. ఇందులో భారత్ విలువ 0.633 నుంచి 0.644కి పెరిగిందని తెలిపింది. దీంతో 194 దేశాల జాబితాలో భారత్ 134వ స్థానంలో నిలిచింది. 'మానవాభివృద్ధిలో భారత్ కొన్నేళ్లుగా పురోగతిని కనబరుస్తోంది. సగటు మనిషి ఆయుర్దాయం 67.2 ఏళ్ల నుంచి 67.7కి పెరిగింది. స్థూల జాతీయ ఆదాయం 6,542 డాలర్ల నుంచి 6,951 డాలర్లకు పెరిగింది. లింగ అసమానతలు తగ్గాయి. ఇతర దక్షిణాసియా దేశాల కంటే 0.437 సగటుతో ప్రపంచంలో 108వ స్థానంలో ఉంది. ఉద్యోగాల విషయంలో ఇది ఇంకా కొనసాగుతోంది. మధ్యస్థాయి హెచ్‌డీఐ ప్రమాణాలు కలిగిన దేశాలతో పోలిస్తే భారత్‌లో ఆరోగ్య సంరక్షణ మెరుగైంది. చిన్న వయసులో గర్భం దాల్చే వారి సంఖ్య తగ్గింది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు దేశ నిబ్ధతకు ఇది నిదర్శనం. భారత్‌లో అభివృద్ధికి మరింత అవకాశం ఉంది. మహిళాభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా సామాజిక ఆర్థికాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లొచ్చు" అని భారత్‌లో యూఎన్‌డీపీ ప్రతినిధి కైట్లిన్ వైసెన్ తెలిపారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా

జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధు

- అమిత్ షా శాఖ మాజీ కార్యదర్శే జ్ఞానేష్ కుమార్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘంలో ఎన్నికల కమిషనర్లుగా మాజీ బ్యూరోక్రాట్‌లు జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధులను నియమించారు. ఎన్నికల కమిషన్‌లో ఖాళీ అయిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ఉన్నత స్థాయి సెలక్షన్ బోర్డు గురువారం సమావేశం అయింది. ఈ సమావేశంలో ప్రధాని మోడీతో పాటు కమిటీ సభ్యులు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధులను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కమిటీ సభ్యుల్లో ఒకరు, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ "బుధవారం రాత్రి పరిశీలన కోసం నాకు 212 పేర్లు ఇచ్చారు. సమావేశానికి పది నిమిషాల ముందు ఆరుగురి(ఉత్పల్ కుమార్ సింగ్, ప్రదీప్ కుమార్ త్రిపాఠి, జ్ఞానేష్ కుమార్, ఇండెవర్ పాండే, సుఖ్బీర్ సింగ్ సంధు, సుధీర్ కుమార్ గంగాధర్ రహతే)తో కూడిన షార్ట్‌లిస్ట్ పేర్లను ఇచ్చారు. చివరకు పంజాబ్‌కు చెందిన సంధూ, కేరళకు చెందిన జ్ఞానేష్ ను ఎంపిక చేశారు. కమిటీలో మెజారిటీ వారికి ఉంది. కాబట్టి వారు తమకు కావలసిన అభ్యర్థులను ఎంచుకున్నారు. ఇది ఏకపక్షమని నేను చెప్పను. కాకపోతే ఇసిల ఎంపికకు అనుసరిస్తున్న ప్రక్రియలో లోపాలున్నాయి. ఎంపిక కమిటీలో సిజెఐ సభ్యులుగా ఉండాలి" అని అన్నారు. అలాగే ఎంపిక విధానాన్ని తాను ప్రశ్నించానని, దీనిపై అసమ్మతి లేఖ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. కాగా ఇసిల నియామకం కోసం న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, హోంశాఖ కార్యదర్శి, సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీ ప్రతిపాదిత పేర్లతో జాబితాను రూపొందించింది. అనంతరం మోడీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశమై దీనిపై చర్చించింది. అనుప్ చంద్ర పాండే పదవీ విరమణ, అరుణ్ గోయల్ రాజీనామా కారణంగా కమిషన్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ అయ్యాయి.

అమిత్ షా శాఖ మాజీ కార్యదర్శే జ్ఞానేష్ కుమార్

జ్ఞానేష్ కుమార్ 1988 బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, సహకార శాఖ కార్యదర్శిగా ఉన్న ఆయన 2024 జనవరి 31న పదవీ విరమణ పొందారు. ఆర్టికల్ 370 రద్దు చేసినప్పుడు కూడా హెూం శాఖలోనే బాధ్యతలు నిర్వర్తించారు. జ్ఞానేష్ కుమార్ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతోపాటు అమిత్ షా నేతృత్వంలోని సహకార మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా పనిచేశారు. సుఖ్‌బీర్ సంధు 1988 బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి. పంజాబ్‌కు చెందిన సంధు ఉత్తరాఖండ్ ఐఎఎస్ కేడర్‌కు చెందినవారు. సంధు గతంలో ఉత్తరాఖండ్ ప్రధాన కార్యదర్శిగా, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్‌తో సహా పలు కీలక ప్రభుత్వ పదవులు చేపట్టారు.

అమిత్ షా అస్సాం పర్యటన రద్దు

- సిఎఎ నిరసనల ఎఫెక్టు



గౌహతి: సిఎఎకి వ్యతిరేకంగా ప్రజల నిరసనలకు భయపడి కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అస్సాం పర్యటనను రద్దు చేసుకున్నారు. మార్చి 15న అస్సాంలో జరిగే ఓ అధికారిక కార్యక్రమానికి ఆయన హాజరవ్వాల్సి ఉంది. అమిత్ షా పర్యటన రద్దయిందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. మరోవైపు అస్సాంలో సిఎఎ వ్యతిరేక ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా విద్యార్థులు ఉద్యమంలోకి దిగారు. ఈ రోజు గౌహతి సహా పలు జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి . ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా దిష్టిబొమ్మలను నిరసనకారులు దగ్ధం చేశారు. శివసాగర్‌లో ఆందోళనకారులతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. మరోవైపు, అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సిఎఎకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేసు వేసింది. పార్టీ తరపున అసెంబ్లీలో ప్రతిపక్ష నేత దేబ్‌బ్రత సైకియా, బార్‌పేట కాంగ్రెస్ ఎంపీ అబ్దుల్ ఖలేక్ సుప్రీంకోర్టులో కేసు వేశారు. సిఎఎ అమల్లోకి వచ్చిన తర్వాత సుప్రీంకోర్టులో మూడు కేసులు దాఖలయ్యాయి. మార్చి 11వ తేదీ రాత్రి రూల్‌ను అమలు చేసిన మరుసటి రోజే డివైఎఫ్ఐ, ముస్లిం లీగ్‌లు కేసు వేశాయి. మూడు అంశాలను దష్టిలో ఉంచుకుని కేసు దాఖలు చేసినట్లు దేబ్‌బ్రత సైకియా సుప్రీంకోర్టులో పిటషన్ వేశారు. మొదటిది, సిఎఎ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తుంది. ఈ విభాగం సమానత్వ హక్కు గురించి మాట్లాడుతుంది. కానీ మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వాలనేది సిఎఎ ఉద్దేశం. రెండవది, సిఎఎ అస్సాం ఒప్పందాన్ని బలహీనపరిచింది. చాలా పోరాటాల తర్వాత 1985లో అస్సాం ఒప్పందం కుదిరింది. మూడవది, సిఎఎ ఆరు ముస్లిమేతర మతస్తులకు పౌరసత్వాన్ని అందిస్తుంది. ముస్లింలతో పాటు తమిళులు కూడా ఈ చట్టం నుండి మినహాయించబడ్డారు. శ్రీలంక నుండి వచ్చిన తమిళులు కూడా ఈ చట్టం ప్రకారం పౌరసత్వానికి అర్హులు కాదు. రాజ్యాంగ విరుద్ధమైన, అస్సాం ఒప్పందాన్ని ఉల్లంఘించే ఈ చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని సైకియా తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల తరువాత జనగణన?

న్యూఢిల్లీ : గత కొన్నేళ్లుగా వాయిదాలు పడుతూ వస్తోన్న జనగణన ఈ ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలప్రక్రియ ముగిసిన తరువాత చేపట్టనున్నట్లు సమాచారం. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ మీడియా కథనం వెల్లడించింది. ఇందుకోసం దాదాపు 3 లక్షల మంది ప్రభుత్వ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ జనగణన దాదాపు 12 నెలల పాటు కొనసాగనున్నట్లు తెలుస్తోంది.

దేశంలో 1881లో తొలి జనగణనను నిర్వహించారు. అప్పటినుంచి ప్రతీ దశాబ్దం ప్రారంభంలో అది కొనసాగుతూ వచ్చింది. అయితే చివరిసారిగా 2011లో దీన్ని నిర్వహించారు. 2021లో జనగణన చేపట్టాల్సి ఉండగా.. కరోనా, ఇతర కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది.

2011 నాటి లెక్కల ప్రకారమే ఇప్పటికీ రేషన్ కార్డుల జారీ వల్ల కనీసం పది కోట్ల మంది వరకు అర్హులకు సంక్షేమ పథకాలు అందట్లేదనేది విశ్లేషకుల మాట. అలాగే ఈసారి కులాల ఆధారంగా జనాభాను లెక్కించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అలాగే గతేడాది ఏప్రిల్‌లో చైనాను అధిగమించి అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ఆవిర్భవించినట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. దీంతో జనగణనపై దేశంలోని ప్రజలతో పాటు ప్రపంచం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

ఆహారం కోసం ఎదురుచూసేవారిపై, శరణార్థ శిబిరాలపై

ఇజ్రాయిల్ దాడులు

దజన్ల సంఖ్యలో మృతి, 83మందికి గాయాలు



గాజా : ఆకలి బాధతో ఆహారం కోసం ఎదురుచూస్తున్న వారిపై, శరణార్థ శిబిరాలపై ఇజ్రాయిల్ దారుణంగా దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో డజన్ల సంఖ్యలో మరణించగా, పెద్ద సంఖ్యలో గాయపడ్డారని అధికారులు తెలిపారు. సెంట్రల్ గాజాలోని బురేజి శరణార్థ శిబిరం, నుస్రత్ శరణార్థ శిబిరాలపై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడిలో 17మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. మరోవైపు రాఫా నగరంలో ఆహారం కోసం యుఎన్ఆర్‌డబ్ల్యుఎ ఆహార కేంద్రం వెలుపల బారులు తీరి నిలుచున్న వారిపై ఇజ్రాయిల్ సైన్యం దారుణంగా బాంబు దాడులు జరిపింది. ఈ దాడిలో మొత్తంగా ఐదుగురు మరణించగా, గాజా నగరంలో జరిపిన మరో దాడిలో ఆరుగురు మరణించగా, 83మంది గాయపడ్డారు. ఇటీవలి వారాల్లో సాయం కోసం వేచి వున్న సామాన్యులపై దారుణమైన దాడులకు దిగడం బాగా ఎక్కువైంది. గాజాలో సాయం అందుకోవడానికి వెళ్లడం కూడా చాలా ప్రమాదకరమైనదిగా మారింది. దాడులు జరిగిన కువైట్ రౌండ్ అబౌట్ ప్రాంతం మృత్యు కుహరంగా మారిందని మీడియా వర్గాలు వ్యాఖ్యానించాయి. ఆహారం కోసం వెళ్ళిన వారిని ఇలా చంపేస్తుంటే ఇంకా గాజాలోకి సహాయ ట్రక్కులు రావడంలో ప్రయోజనం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇజ్రాయిల్ బలగాల ఈ దూకుడు చర్యలతో సహాయ కార్యకర్తల విధులకు కూడా తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇప్పటివరకు ఇలా ఆహార పంపిణీ కేంద్రాలపై జరిగిన దాడుల్లో 400మంది వరకు పాలస్తీనియన్లు మరణించారు. ఇదిలా వుండగా, గాజాలో పరిస్థితులను, ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తూ, గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని కోరుతూ ఇయు పార్లమెంట్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రంజాన్ ప్రార్థనల సందర్భంగా అల్ అక్సా మసీదులోకి పాలస్తీనియన్లను అనుమతించనీయకుండా ఆంక్షలు విధించడంపై జోర్డాన్ మండిపడింది. ఇటువంటి చర్యలు ప్రమాదకరమైనవని, ఆమోదయోగ్యం కాని చర్యలని పేర్కొంది.

ఇంకా తెలియని నైజీరియా చిన్నారుల ఆచూకీ

అబుజా: నైజీరియాలోని వాయవ్య ప్రాంతంలో నుంచి సాయుధ దుండగులు ఒక పాఠశాల నుంచి సుమారు 287మంది విద్యార్థులను అపహరించుకుపోయి వారం రోజులు దాటింది. అయినా చిన్నారుల ఆచూకీ ఇంకా తెలియలేదు. అయితే చిన్నారులను విడుదల చేయడం కోసం ఆ దుండగులు భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నానట్లు సమాచారం. డబ్బులు ఇవ్వకపోతే పిల్లల్ని చంపేస్తామని బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని స్థానిక మీడియా తెలిపింది. 'ఒక బిలియన్ నైరాలు(రూ.5.15 కోట్లు) ఇవ్వాలని దుండగులు డిమాండ్ చేశారు. కిడ్నాప్ జరిగిన రోజు నుంచి 20 రోజుల వ్యవధిలో ఆ మొత్తం ఇవ్వాలి. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేకపోతే.. అందరినీ చంపేస్తామని బెదిరించారు' అని మీడియా తెలిపింది. గతవారం పాఠశాల కార్యకలాపాలు ప్రారంభం కాబోతున్న తరుణంలోనే ఈ కిడ్నాప్ ఘటన చోటుచేసుకుంది. కిడ్నాప్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని కాల్చిచంపారు. 287 విద్యార్థుల్ని సమీప అడవుల్లోకి తీసుకుపోయారు. అపహరణకు గురైనవారి ఆచూకీ కోసం భద్రత బలగాలు గాలిస్తున్నాయి.

ప్రభుత్వ బ్యాంక్‌ల్లో 25 శాతం వరకు వాటాల విక్రయం

- ఆ ఐదు బ్యాంక్‌ల్లో ఉపసంహరిస్తాం
- ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి వెల్లడి

న్యూఢిల్లీ : ఐదు ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో 25 శాతం వరకు వాటాలను మార్కెట్ శక్తులకు విక్రయిస్తామని ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి అన్నారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌ల్లో వాటాల ఉపసంహరణ ఉంటుందన్నారు. సెబీ రూపొందించిన మినిమం పబ్లిక్ షేర్ హోల్డింగ్ (ఎంపిఎస్) నిబంధనల ప్రకారం.. 12 ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఐదింటిలో ప్రభుత్వ వాటాను 75 శాతం కంటే దిగువకు తగ్గించుకోవాల్సి ఉందన్నారు. స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అయిన వాటిలో పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లో 98.25 శాతం, ఐఒబిలో 96.38 శాతం వాటా, యూకో బ్యాంక్‌లో 95.39 శాతం వాటా, సెంట్రల్ బ్యాంక్‌లో 93.08 శాతం, బిఒఎంలో 86.46 శాతం చొప్పున కేంద్ర ప్రభుత్వం వాటాలు కలిగి ఉంది.

సెబీ ఎంపిఎస్ నిబంధనల ప్రకారం కనీసం 25 శాతం వాటాలను విక్రయించాలని మోడీ సర్కార్ ఒత్తిడి తెస్తోంది. 2024 ఆగస్ట్ నాటికి ఈ లక్ష్యాన్ని చేరాలని సూచిస్తుంది. కాగా.. బ్యాంక్‌లు తమ వాటాను తగ్గించుకోవడానికి ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్, లేదా క్వాలిఫైడ్ ఇన్‌స్ట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యుఐపి)లను అనుసరించవచ్చని జోషి తెలిపారు.

కాంగ్రెస్ 'కిసాన్ న్యాయ్'

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'కిసాన్ న్యాయ్' పేరిట కాంగ్రెస్ పార్టీ రైతులకు ఐదు హామీలు ఇచ్చింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, వ్యవసాయ పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేత, రైతుల కోసం శాశ్వత రుణమాఫీ కమిషన్ ఏర్పాటు, పంటల బీమా సొమ్ము 30 రోజుల్లో నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం, రైతులకు న్యాయం జరిగేలా కొత్త ఎగుమతి, దిగుమతుల విధానం అమలుచేస్తామని రైతులకు హామీ ఇచ్చింది. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా చంద్వాడ్‌లో కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 'ఇండియా' వేదికను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం తలుపులు రైతులకు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోని కేవలం 20 నుంచి 25 మందికి దేశ జనాభాలో 70 కోట్ల మందికి సమానమైన సంపద ఉందన్నారు. మోదీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు రూ.16లక్షల కోట్లు మాఫీ చేసిందని రాహుల్ విమర్శించారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో రైతులకు రూ.70వేల కోట్లు రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

బిజెపిని ఓడించేందుకు ఐక్య పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో ఎస్‌కెఎం నేతలు అశోక్ దావలే, విజూ కృష్ణన్, హన్నన్ మొల్లా, కృష్ణ ప్రసాద్, రాకేష్ టికాయిత్, దర్శన్‌పాల్, జోగిందర్ సింగ్ ఉగ్రహన్, బల్బీర్ సింగ్ రాజేవాల్, సునీలం, సత్యవాన్, రావుల వెంకయ్య, హర్మీత్ కడియన్, బసవ రాజప్ప, లింగరాజ్ ఆజాద్, వికాస్ సిసార్, తేజిందర్ సింగ్ విర్క్, గుర్నామ్ సింగ్ చదువుని, అవిక్ సాహా, మేధా పాట్కర్, రాజారామ్ సింగ్, హరీందర్ లఖోవాల్, కుల్వంత్ సంధు, చమ్రాసా మాలి పాటిల్, జోగిందర్ నయన్, జగ్తార్ బజ్వా, మంజీత్ ధనేర్, సుభాష్ కకుస్తే, సురేష్ కౌత్, రాజేంద్ర చౌదరి, అశోక్ బైతా, జంగ్వీర్ చౌహాన్, సత్యదేవ్ పాల్, బూటా సింగ్ బుర్జ్‌గిల్, రాజిందర్ సింగ్ దీప్సింగ్వాలా తదితరులు పాల్గొన్నారు.



16 మందితో లెఫ్ట్ ఫ్రంట్ తొలి జాబితా

- అందులో సిపిఎం 13, సిపిఐ 1, ఫార్వర్డ్ బ్లాక్ 1, ఆర్ఎస్‌పి 1

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ పశ్చిమ బెంగాల్‌లోని 16 లోక్‌సభ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. సీట్లు సర్దుబాటుపై కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయని లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బోస్ అన్నారు. గురువారం కలకత్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వామపక్ష కూటమి నాయకులతో కలిసి బిమన్ బోస్ మాట్లాడారు. 16 మంది అభ్యర్థులలో 14 మంది కొత్తవారని, యువకులని పేర్కొన్నారు. "మేము 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాం. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తమ హైకమాండ్‌తో మాట్లాడటానికి ప్రస్తుతం న్యూఢిల్లీలో ఉన్నారు. కాబట్టి, వారు తిరిగి వస్తే, ఆపై చర్చిస్తాం ఏమి జరుగుతుందో చూద్దాం" అని బోస్ అన్నారు. ఈ నెల 16న లెఫ్ట్ ఫ్రంట్ లో భాగస్వామ్య పార్టీలైన సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పిల మధ్య మళ్లీ చర్చలు జరుపుతామని చెప్పారు. జాబితా ప్రకారం సృజన్ భట్టాచార్య (జాదవ్‌పూర్), దీప్సితా ధర్ (సెరాంపూర్), దేబ్రాజ్ బర్మన్ (జల్పాయిగురి), మోనోదీప్ ఘోష్ (హుగ్లీ), నీలాంజన్ దాస్‌గుప్తా (బంకురా), శీతల్ కైబర్తా (బిష్ణుపూర్), నిరబ్ ఖాన్ (బుర్ద్వాన్-పుర్బా) సిపిఎం తరపున పోటీ చేయనున్నారు. కోల్‌కతా సౌత్ నుంచి సైరా షా హలీమ్, డమ్ డమ్ నుంచి సుజన్ చక్రవర్తి, కలకత్తా హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయవాదులు సయన్ బెనర్జీని తమ్లుక్, సబ్యసాచి ఛటర్జీని హౌరా నుండి అభ్యర్థులుగా బరిలో దింపింది. జమూరియా మాజీ ఎమ్మెల్యే జహనారా ఖాన్‌కు అసన్‌సోల్ నుంచి బరిలో దింపింది. సిపిఎంకి చెందిన మరో మాజీ ఎమ్మెల్యే ఎస్ఎం సాదీ కృష్ణానగర్ నుంచి పోటీ చేయనున్నారు. సిపిఐ నుంచి మిడ్నాపూర్ అభ్యర్థిగా విప్లవ్ భట్టా, కూచ్‌బెహార్ నుంచి ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన నితీష్ చంద్రరాయ్, బలూర్‌ఘాట్ నుంచి ఆర్ఎస్‌పి నేత జోయ్‌దేవ్ సిద్ధాంతను బరిలోకి దింపాయి.

టిడిపిలో చేరిన కర్నూలు ఎంపి సంజీవ్

- కండువా కప్పి ఆహ్వానించిన చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కర్నూలు ఎంపి సంజీవ్‌కుమార్ టిడిపిలో చేరారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ కార్యక్రమం గురువారం జరిగింది. సంజీవ్ కుమార్‌తో పాటు పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టరు పి రమేష్, వెంకాయపల్లె ఆలయ ఛైర్మన్ బేతం కృష్ణుడు, వాల్మీకి సంఘం నాయకులు ఎం శేఖర్ తదితరులకు చంద్రబాబు టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వైసిపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నాని (ఈలి వెంకట మధుసూదనరావు) వైసిపిలో చేరారు. గురువారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపి కండువా కప్పుకున్నారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈలి నాని.. గత ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ పివి మిథున్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురు ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ముగ్గురు ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎమ్‌డిగా తిరుపతి జాయింట్ కలెక్టరు శభమ్ బన్సాల్‌ను బదిలీ చేశారు. అలాగే శాప్ ఎమ్‌డి హెచ్‌ఎం ద్యాన్‌చంద్రను తిరుపతి జాయింట్ కలెక్టరుగా నియమించారు. ఎపి సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎమ్ శివప్రసాద్‌కు విలేజ్ సెక్రటేరియట్, వార్డు సెక్రటేరియట్‌శాఖ డైరెక్టరుగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

'జమిలి'కి తలూపారు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఒకవేళ హంగ్ ఏర్పడితే అప్పుడు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత మరో అయిదేళ్లకు చెందిన తాజా ఎన్నికలను మళ్లీ నిర్వహించాల్సి ఉంటుందని కోవింద్ ప్యానెల్ రిపోర్టులో పేర్కొంది. తొలిసారి జరిగే జమిలీ ఎన్నికలకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీల కాల పరిమితి లోక్‌సభ ఎన్నికల తేదీ నాటికే ముగుస్తుందని నివేదికలో తెలిపింది.

జమిలీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తు ప్లానింగ్ ఉండాలని, ఎన్నికలకు అవసరమైన యంత్ర పరికరాలు, సిబ్బంది, భద్రతా బలగాలను మోహరించాల్సి ఉంటుందని రిపోర్టులో పేర్కొన్నారు. సింగిల్ ఎన్నికల రోల్‌ను ఎన్నికల సంఘం తయారు చేయాల్సి ఉంటుంది. ఆయా రాష్ట్రాల అధికారులతో కలిసి లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలకు చెందిన ఓటరు ఐడీ కార్డులను రూపొందించాల్సి ఉంటుంది. జమిలీ ఎన్నికల నిర్వహణతో పారదర్శకత పెరుగుతుందని తెలిపింది. జమిలీతో పరిపాలనా వ్యవస్థ వృద్ధి చెందుతుందని రిపోర్టులో పేర్కొంది. కమిటీ ఇచ్చిన సిఫార్సుల అమలును పరిశీలించే ఒక ఇంప్లిమెంటేషన్ గ్రూప్‌ను ఏర్పాటు చేయవచ్చని కూడా కమిటీ సిఫార్సు చేసింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత మొదటి సమావేశ తేదీని అపాయింటెడ్ తేదీగా పేర్కొంటూ రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేయాలని కమిటీ ప్రతిపాదించింది. నివేదిక అందజేసిన వారిలో రామ్‌నాథ్ కోవింద్ తో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, డిపిఎపి నేత గులాం నబీ ఆజాద్, కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు ఉన్నారు.

ఇది పూర్తిగా ఆచరణీయం కాదు: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్

'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై కమిటీ ఇచ్చిన నివేదక ఆచరణీయం కాదని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ అన్నారు. "నివేదికలో సూచించినట్లు వాటిని అమలు చేయవలసి వస్తే, మార్పు తీసుకురావడానికి ఆర్టికల్స్ చేర్చి, చొప్పించాలనుకుంటున్నారు. దానికి రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉంది. 2/3వ మెజారిటీతో పాటు సగం రాష్ట్రాలు కూడా తమ అంగీకారాన్ని ఇవ్వాలి. కాబట్టి, ఇది చాలా సుదీర్ఘమైన ప్రక్రియ. వారు పదవీకాలాన్ని మాత్రమే చూశారని నేను భావిస్తున్నాను. వారు అన్నింటిని కూడా చూడాలి. అత్యవసర అధికారాలు, రాష్ట్రపతి అధికారాలు, రాష్ట్రపతి పాలన మొదలైన వాటితో సహా రాజ్యాంగంలోని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉంది. ఈ సమగ్రమైన కసరత్తు చేయాలి. ఆచరణాత్మకంగా లేకుండా చేస్తే, ఇది అర్థవంతం కాదని నేను భావిస్తున్నాను. ఎందుకంటే గత 75 ఏళ్లలో ప్రభుత్వాలు ఎలా ఏర్పాడ్డాయో, పార్లమెంట్, శాసనసభలు ఎలా ఏర్పడ్డాయో మనం చూశాం. పరిష్కరించాల్సిన ప్రత్యేక సమస్య ఏదీ ఇందులో పేర్కొనలేదు. నా దృష్టిలో ఇది పూర్తిగా ఆచరణీయం కాదు. పూర్తిగా అనవసరం" అని అన్నారు.



మీ కోసం

ఐస్ క్యూబ్ ట్రేలో పోసే నీటిని కాచి, వడపోయాలి. ఇలా చేస్తే నీటిలోని కనిపించని మలినాలు పోతాయి. ఐస్ క్యూబ్స్ క్రిస్టల్ క్లియర్‌గా వస్తాయి.

జీవన సౌరభం

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించాలి. బలహీనపరిచే ప్రతి ఆలోచనని తిరస్కరించాలి.

వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ...


నిద్ర లేచింది మొదలు టూత్‌పేస్టు నుంచి మందులు, తినే ఆహార పదార్థాల వరకూ మార్కెట్లో దొరికే అన్ని వస్తువుల్లోనూ కల్తీలతో మోసాలు జరుగుతూనే ఉంటున్నాయి. ధరల్లో వ్యత్యాసాలు, తూకాల్లో మోసాలు, కల్తీ, నకిలీ వస్తువుల చెలామణి వంటివన్నీ ఈ కోవకే చెందుతాయి. కొందరు అక్రమార్కులు సిండికేట్లుగా మారి దోపిడీని విపరీతంగా కొనసాగిస్తారు. తెలిసినా మనకెందుకులే అని కొందరు వదిలేస్తున్నారు. మరికొందరు ప్రశ్నిస్తుంటారు. అలాంటి వారిలో బొబ్బిలి బంగారయ్య ఒకరు. వినియోగదారుల హక్కుల రక్షణ కోసం ఆయన మూడు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేస్తున్నారు.



పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు మండలం బావాయిపాలెంలో 1952 జులై 20న బొబ్బిలి వీరన్న, దుర్గమ్మ దంపతులకు బంగారయ్య జన్మించారు. పేదరికం కారణంగా వివిధ పనులు చేసుకుంటూనే ఇంటర్మీడియట్ వరకూ చదివారు. సైకిల్‌పై మరమరాలు కూడా అమ్మారు. తర్వాత ఉపాధి కోసం ఆకివీడుకు వెళ్లారు. భార్య నాగవరలక్ష్మి సహకారంతో 1975లో సహకార శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అటెండర్ నుంచి ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన కార్యదర్శి స్థాయి వరకూ ఎదిగారు. ఎన్నోమంది రైతుల నుంచి ప్రశంసలు పొందారు. 2010 జులైలో ఉద్యోగ విరమణ పొందారు.

వినియోగదారుల హక్కుల కోసం

చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న మోసాల గురించి పత్రికల్లోనూ, ఇతరుల ద్వారా తెలుసుకుని స్పందించేవారు. వీటికి అడ్డుకట్ట వేయలేమా? అనుకుంటున్న తరుణంలో 1986లో కేంద్రం జాతీయ వినియోగదారుల హక్కుల చట్టం తెచ్చింది. అప్పుడు మరికొంతమంది మిత్రులు కలిసి వినియోగదారుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1991లో జిల్లాస్థాయిలో, 1992లో రాష్ట్రస్థాయిలో సంఘాల ఏర్పాటులో కీలకపాత్రలు పోషించారు. తొలుత ఆకివీడులో వినియోగదారుల సంఘాన్ని పటిష్టం చేయటంతోపాటు వందలాదిగా జిల్లా, రాష్ట్ర వినియోగదారుల సంఘాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. వినియోగదారుల ఉద్యమంలో ఎంతోమందికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు.



వృద్ధుల సమస్యలపైనా కార్యాచరణ

2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన వృద్ధుల సంక్షేమ చట్టం వచ్చాక ఆ సమస్యపై దృష్టి పెట్టారు. 2012లో స్థానిక వైద్య ప్రముఖులు డాక్టర్ ఎంవి సూర్యనారాయణరాజు సహకారంతో సర్ ఆర్థర్ కాటన్ ఆకివీడు మండల వృద్ధుల సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. మొదట్లో 70 మంది చేరారు. వృద్ధుల సంక్షేమ సంఘానికి రాష్ట్ర సహధ్యక్షులుగా కొనసాగుతూ ఏటేటా వందలాది మంది పేద వృద్ధులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేస్తున్నారు.

ఎన్నికల నిఘా వేదిక లో ...

ఎన్నికల సంగ్రామంలో నీతీ, నిజాయితీ నిలబడాలి అనేది బంగారయ్య భావన. ఎవరూ ఓట్లు అమ్ముకోవద్దనీ, నిజాయితీ పరులకే ఓట్లు వేయాలని పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. 2010లో జిల్లా కలెక్టర్ స్వయంగా పిలిచి ఎన్నికల నిఘా వేదిక జిల్లా కోకన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించారు. అప్పుడు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ఊరూరా ప్రచారం జరిపారు. డబ్బు, అవినీతి ఓటు విలువలను ఎలా దిగజార్చుతాయో ప్రచారం నిర్వహించారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ సభ్యునిగా కూడా పనిచేశారు. విచ్ఛిన్నమయ్యే సుమారు 60 కుటుంబాలను తాము కలపగలిగామని బంగారయ్య సంతోషాన్ని వ్యక్తంచేశారు.



62 ఉత్తమ సేవా పురస్కారాలు

వినియోగదారుల హక్కులు, వృద్ధుల సంక్షేమం కోసం చేసిన కృషికి గాను ఆయన రాష్ట్రప్రభుత్వం ద్వారా ఇప్పటివరకూ 62 సార్లు ఉత్తమ పురస్కారాలు లభించాయి. మొత్తం 129 అవార్డులు పొందారు. పలు సంస్థల ద్వారా మరో 70 వరకూ అవార్డులను అందుకున్నారు. జాతీయస్థాయి రివార్డులు సైతం ఆయన్ను వరించాయి. 2002లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. 2001 అమెరికాలోని బయోగ్రాఫికల్ ఇనిస్టిట్యూట్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందజేసింది. వినియోగదారుల ఫోరం క్యాపో్మ-కార్ప్స్ ఐదుసార్లు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారాలను అందించింది.

- గుడిపాటి వెంకటేశ్వరరావు (వెంకన్న), ప్రజాశక్తి ఆకివీడు విలేకరి, 97053 46818.

రూ.20 కోట్లు వరకూ పరిహారం రప్పించాం



వినియోగదారులకు సంబంధించిన సుమారు 3000లకుపైగా కేసులను పరిష్కారం వచ్చేలా కృషిచేశాను. ఆయా కేసుల తాలూకా బాధితులకు సుమారు రూ.20 కోట్లు వరకూ పరిహారం అందింది. వినియోగదారుల హక్కుల చట్టంపై పాఠశాలలు, కళాశాలలు, విద్యాలయాల్లో వేలాది వేదికల ద్వారా అవగాహన కల్పించాం. 2008లో ఆంధ్రా బ్యాంకు ద్వారా 315 మంది రైతులకు రూ.70 లక్షల బీమా పరిహారం మంజూరుకు కృషిచేశాం. 2012లో చినకాపవరంలో గోదావరి బ్యాంకులో ఓ ఉద్యోగి అవినీతికి పాల్పడగా రైతుల పక్షాన నిలబడి వారికి డబ్బులు ఇప్పించేలా కృషి చేశాను. తాడేపల్లిగూడెం ఆంధ్రాబ్యాంకు ద్వారా రూ.కోటి వరకూ బీమా పరిహారాన్ని ఇప్పించాం. చినమిల్లిపాడులో రైతుల తరపున వినియోగదారుల ఫోరంలో కేసు వేసి 79 మంది రైతులకు బీమాతోపాటుగా రూ.79 వేలు అదనంగా వచ్చేలా కృషిచేశాము.

- బొబ్బిలి బంగారయ్య
వినియోగదారుల సంఘం రాష్ట్ర సహ అధ్యక్షులు, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా.



ఉయ్యాల-ఉయ్యాల

చెట్టుకింద ఉయ్యాల
చక్కనైన ఉయ్యాల
ఊగుదాం ఉయ్యాల
చెల్లి రావే, ఈ వేళ ...

ఊగుదాం ఊగుదాం
ఉయ్యాల ఊగుదాం
పాడుదాం పాడుదాం
పాటలెన్నో పాడుదాం

నవ్వుతూ నవ్వుతూ
ఉయ్యాల ఊగుదాం

ఊగుతూ ఊగుతూ
పైపైకి ఊగుదాం

కొట్టుకోకుండా
తిట్టుకోకుండా
చెట్టు నీడలో ఊగుదాం
చెల్లి మనము ఊగుదాం

ఉయ్యాల ఊగుతూ
ఊరినే మారుద్దాం
మంచిగా ఊగుతూ
మైమరిచి పోదాం!



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలో కనిపిస్తున్న చుక్కలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



పాతూరి మోషే, 2వ తరగతి ఎం.పి.పి.ఎస్, వానపాముల (హెచ్.డబ్ల్యు) పెద పారుపూడి మండలం కృష్ణా జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బ్యాంకాక్‌లో 'కుబేర' తాజా షెడ్యూల్



ధనుష్, నాగార్జున కథానాయకులుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీస్టారర్ చిత్రం 'కుబేర'. శ్రీ వెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ పతాకాలపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలైంది. ఇందులో నాగార్జునతో పాటు చిత్ర ప్రధాన తారాగణం పాల్గొంటున్నారు. టాకీతో పాటు యాక్షన్ పార్ట్‌ను తెరకెక్కించ బోతున్నామని, బ్యాంకాక్‌లో ఇప్పటి వరకు ఎవరూ చూడని సరికొత్త లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుతున్నామని చిత్ర బృందం పేర్కొంది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ చేస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

నా సినిమాని కూడా నలుగురు పెద్దలు చూడండి..



విశ్వక్ సేన్, చాందిని చౌదరి ప్రధాన పాత్రల్లో వచ్చిన తాజా చిత్రం 'గామి'. మార్చి 8న విడుదలైన ఈ చిత్రం, ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందుతోంది. తాజాగా ఈ సినిమా ప్రెస్ మీట్‌లో పాల్గొన్న విశ్వక్ సేన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'చాలా రిస్క్ చేసి 'గామి' సినిమా తీశాం. ఇది కమర్షియల్‌గా హిట్ అయినందుకు చాలా ఆనందంగా ఉంది. మేం ఆరేళ్లు కష్టపడి తీసిన సినిమా ఇది. మా సినిమాను కూడా నలుగురు పెద్ద మనుషులు చూసి.. మాట్లాడితే బాగుంటుంది. ఇది మన తెలుగు సినిమా. ఇలాంటి చిత్రం ఇప్పటి వరకు రాలేదని గర్వంగా చెబుతాను. మరో 20 ఏళ్ల తర్వాత తెలుగులో ఇలాంటి సినిమా వచ్చిందని గర్వంగా చెప్పొచ్చు. అంటూ విశ్వక్ వెల్లడించారు.

'ది 100' చిత్రం చాలా అద్భుతంగా ఉంది

వెంకయ్యనాయుడు



'ది 100' చిత్రం మంచి సందేశంతో చాలా అద్భుతంగా ఉంది. సినిమా చూసిన తర్వాత పోలీస్ అధికారి అంటే సాగర్‌లా ఫిట్‌గా హుందాగా ఉండాలనిపించింది. తప్పకుండా ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే విశ్వాసం ఉంది' అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. లాంచ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. ఆర్‌కె సాగర్‌ని విక్రాంత్ ఐపిఎస్‌గా పరిచయం చేస్తూ 'ది 100' సినిమా తీసిన విషయం తెలిసిందే. ఆర్‌కె సాగర్, రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహిస్తున్నారు. క్రియా ఫిల్మ్ కార్ప్, ధమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రమేష్ కరుటూరి, వెంకీ పూశడపు,జె.తారక్‌రామ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పోస్టర్ లాంచ్‌కు ముందు ఈ సినిమాను వెంకయ్యనాయుడు వీక్షించారు.

నటి మమితాబైజుకు మరోఛాన్స్



కోలివుడ్ నటి మమితాబైజుకు మరో సినిమాలో నటించే అవకాశం లభించింది. ఇటీవల వచ్చిన 'ప్రేమలు' సినిమాలో ఆమె నటించిన విషయం తెలిసిందే. కోలీవుడ్ హీరో విష్ణువిశాల్ నటిస్తున్న 21వ చిత్రంలో కథానాయికగా మమితాబైజును ఎంపికచేస్తున్నట్లుగా సమాచారం. కోలీవుడ్‌లో జీవీ ప్రకాష్‌కుమార్ నరసన 'రెబల్' చిత్రంలో ఆమె మొదటిసారిగా నటిగా రంగ ప్రవేశం చేశారు. తాజాగా విష్ణువిశాల్ సినిమాలో అవకాశం వచ్చింది. దర్శకుడు రామ్‌కుమార్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

యమధీర టీజర్ విడుదల



కన్నడ హీరో కోమల్‌కుమార్, భారత క్రికెటర్ శ్రీశాంత్ ప్రతినాయక పాత్రల్లో నటించిన సినిమా యమధీర. వేదాల శ్రీనివాస్ నిర్మించారు. ఈ చిత్ర టీజర్‌ను నటుడు, నిర్మాత అశోక్‌కుమార్ గురువారం విడుదల చేశారు. క్రికెటర్ శ్రీశాంత్ ఫాస్ట్ బౌలర్‌గా మైదానంలో చూపే దూకుడిని ప్రతినాయకుడిగా చూపించే అవకాశం ఉందని సమాచారం. టీమిండియా తరపున పలు మ్యాచ్‌లను ఆడి, ఐపిఎల్‌లో ఫిక్సింగ్ ఆరోపణలను ఎదుర్కొన్న శ్రీశాంత్ ప్రస్తుతం సినిమాల్లో బిజీగా ఉన్నారు. ఆయన నటించిన యమధీర సినిమా ఈనెల 23న విడుదల కానుంది. ఇందులో నాగబాబు, అలీ, సత్యప్రకాష్ తదితరులు కీలకపాత్రలు పోషించారు.



'రవికుల రఘురామ' ట్రైలర్ విడుదల

పాజిటివ్ వైబ్ ప్రొడక్షన్ బ్యానర్ తెరకెక్కుతున్న లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ చిత్రం 'రవికుల రఘురామ'. శ్రీధర్ వర్మ సాగి నిర్మాణంలో.. చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. గౌతమ్ సాగి, దీప్శిక జంటగా నటిస్తున్నారు. సుకుమార్ పమ్మి సంగీత దర్శకుడిగా పనిచేశారు. తాజాగా ఈ చిత్రం నుండి ట్రైలర్ విడుదలైంది. విజయ్ సేతుపతి ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. మార్చి 15న ఈ చిత్రం విడుదలవ్వబోతోంది.

రంజీట్రోఫీ విజేత ముంబయి

- ఫైనల్లో విదర్భపై 169పరుగుల తేడాతో గెలుపు
- రికార్డుస్థాయిలో 42వ సారి టైటిల్ కైవసం



ముంబయి: రంజీట్రోఫీ టైటిల్‌ను ముంబయి జట్టు రికార్డుస్థాయిలో 42వ సారి చేజిక్కించుకుంది. గురువారంతో ముగిసిన ఫైనల్లో ముంబయి 169పరుగుల తేడాతో విదర్భపై ఘన విజయం సాధించింది. వాంఖడే స్టేడియంలో జరిగిన ఫైనల్లో 538పరుగుల భారీ ఛేదనలో భాగంగా విదర్భ జట్టు చివరిరోజు 368పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ ఐదు వికెట్ల నష్టానికి 248పరుగులతో ఐదోరోజు ఆటను కొనసాగించిన విదర్భను కెప్టెన్ అక్షయ్ వాడేకర్(102), హర్ష్ దూబే(65) అర్ధసెంచరీతో ఆదుకున్నా.. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత విదర్భ వరుసగా వికెట్లను కోల్పోయింది. ముంబయి బౌలర్లు తనుష్ కోటియన్‌కు నాలుగు, దేశ్‌పాండే, ముషీర్ ఖాన్‌కు రెండేసి, ములాని, కులకర్ణికి ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో టైటిల్ నెగ్గిన ముంబయి జట్టుకు ఎంసిఎ క్రికెట్ అసోసియేషన్ 5కోట్ల రూపాయల ప్రైజ్ మనీని ఆటగాళ్లకు అదనంగా అందజేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ముషీర్ ఖాన్, సిరీస్ తనుష్ కోటియన్‌లకు దక్కాయి.

కులకర్ణి గుడ్‌బై...

భారత ఫాస్ట్ బౌలర్ ధవల్ కులకర్ణి క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ముంబయి జట్టును 42వ సారి టైటిల్ విజేతగా నిలిపిన కులకర్ణి ఫస్ట్‌క్లాస్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ అవుతున్నట్లు ప్రకటించాడు. ముంబయి విజయంలో కీలక పాత్ర పోషించిన ధవల్ కులకర్ణి ఫైనల్లో విదర్భపై ఆరు వికెట్లు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. కెరీర్ ఆఖరి వికెట్ రెండో ఇన్నింగ్స్‌లో ఉమేశ్ యాదవ్‌ను వెనక్కి పంపి క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు తెలిపాడు. కులకర్ణి 2008లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసి రంజీట్రోఫీలో 15సార్లు ఐదు వికెట్లు, ఒకసారి 10వికెట్ల ప్రదర్శన చేశాడు. మొత్తంగా ఈ స్పీడ్‌స్టర్ 95మ్యాచుల్లో 281 వికెట్లు పడగొట్టాడు.

ముంబయి ఆటగాళ్లకు నజరానా..

అత్యధికసార్లు రంజీట్రోఫీ టైటిల్‌ను అందుకున్న ముంబయిజట్టు ఆటగాళ్లకు అసోసియేషన్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ముంబయి 42వసారి ఛాంపియన్‌గా నిలవడంతో తమ జట్టు సభ్యులకు రంజీట్రోఫీ ప్రైజ్‌మనీతో పాటు డబుల్ నజరానాను ముంబయి క్రికెట్ అసోసియేషన్ ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రైజ్‌మనీ వచ్చే దానితో పాటు అదనంగా రూ.5 కోట్లను సొంతం చేసుకోనుంది. "ఎంసిఎ అధ్యక్షుడు అమోల్ ఖేర్, అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం మేరకు రంజీట్రోఫీ విజేతగా నిలిచిన మా జట్టు సభ్యులకు ప్రైజ్‌మనీని డబుల్ ఇవ్వాలని భావించారు. ముంబయి జట్టుకు ఈ సీజన్ బాగా కలిసొచ్చింది. అన్ని టోర్నీల్లో కలిపి ఏడు టైటిళ్లు సాధించాం. బిసిసిఐ టోర్నీల్లోని అన్ని విభాగాల క్రికెట్‌లో మావాళ్లు రాణించారు" అని ఎంసిఎ కార్యదర్శి అజింక్య నాయక్ వెల్లడించారు.

క్వార్టర్స్‌కు లక్ష్యసేన్


రెండోరౌండ్‌లో ఓడిన సింధు

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

లండన్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీల్లో పివి సింధు మహిళల సింగిల్స్‌లో పరాజయాన్ని చవిచూడగా.. యువ షట్లర్ లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ రెండోరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 4వ సీడ్, డెన్మార్క్‌కు చెందిన ఆంటోన్సెన్‌పై మూడుసెట్ల హోరాహోరీ పోరులో నెగ్గాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 24-22, 11-21, 21-14తో ఆంటోనెన్స్‌ను చిత్తుచేశాడు. ఈ మ్యాచ్ సుమారు 80నిమిషాలసేపు సాగింది. క్వార్టర్స్‌లో 18వ సీడ్ లక్ష్యసేన్ 10వ ర్యాంకర్ లీ-జి-జియా(మలేషియా)తో తలపడనున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు పోరాటం రెండోరౌండ్‌లోనే ముగిసింది. రెండోరౌండ్ పోటీలో సింధు 21-19, 21-11 తేడాతో వరుస సెట్లలో చైనాకు చెందిన ప్రపంచ నంబర్ వన్ షట్లర్ అన్‌సే యంగ్ చేతిలో ఓటమిపాలయ్యింది. ఈ మ్యాచ్ కేవలం 42 నిమిషాల్లోనే ముగిసింది.

ఫైనల్‌కు చేరేదెవరో..?

నేడు డబ్ల్యుపిఎల్ ఏకైక సెమీస్ • రాత్రి 7.30గం॥ల నుంచి



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ ఏకైక సెమీఫైనల్ పోటీ శుక్రవారం జరగనుంది. బుధవారంతో ముగిసిన గ్రూప్ లీగ్ పోటీల తర్వాత టాపర్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ 12పాయింట్లతో నేరుగా ఫైనల్‌కు చేరగా.. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన బెంగళూరు-ముంబయి జట్ల మధ్య ఏకైక సెమీస్ శుక్రవారం జరగనుంది. ఫైనల్ బెర్త్ కోసం డిఫెండింగ్ చాంపియన్ ముంబయితో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఢీ కొట్టనుంది. తొలి సీజన్‌లో టైటిల్‌ను నెగ్గిన ముంబయి రెండో సీజన్‌ను ఘనంగా ఆరంభించింది. ఇక బెంగళూరు తొలి మ్యాచ్‌లో యూపి వారియర్స్‌పై విజయంతో బోణీ కొట్టినా.. ఆ తర్వాత తడబడింది. లీగ్ దశలో ముంబయి, బెంగళూరు రెండ్లుసార్లు తలపడగా చెరో మ్యాచ్‌లో గెలు పొందాయి. ఇరుజట్ల బలాబలాలను పరిశీలిస్తే.. విజయావకాశాలు ముంబయి, ఆర్సీబీకి సమానంగా ఉన్నాయి. నిరుడు జట్టును విజేతగా నిలిపిన హర్మన్‌ప్రీత్ ఈ ఏడాది ఫామ్‌లో ఉంది. యుపిపై అజేయంగా 95పరుగులు చేసి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించింది. బౌలర్ షబ్నమ్ ఇస్మాయిల్ సూపర్ ఫామ్‌లో ఉండగా.. బెంగళూరు ఓపెనర్లు యస్తికా భాటియా, హేలీ మాథ్యూస్‌లు శుభారంభం చేస్తే ముంబయి కష్టాలు తప్పవు.

డబ్ల్యుపిఎల్ పాయింట్ల పట్టిక

	ఫ్రాంచైజీ	ఆ	గె	ఓ	నె.ర.రే
1.	ఢిల్లీ క్యాపిటల్స్	8	6	2	+1,19
2.	ముంబయి	8	5	3	+0.02
3.	బెంగళూరు	8	4	4	+0.30
4.	యుపి	8	3	5	-0.27
5.	గుజరాత్	8	2	6	-1.15

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; నె.ర.రే:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68